



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 | సంచిక : 365 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 19 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

## రామంతాపూర్ బాధిత కుటుంబాలకు.. ఒక్కొక్కరికి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా



**హైదరాబాద్ పెన్ పవర్:** రామంతాపూర్ విద్యుత్ షాక్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. గాయపడ్డ వారికి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు హామీ ఇచ్చింది. సోమవారం ఘటన జరిగిన కొద్ది గంటల్లో మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రకటన చేశారు. మృతులకు కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్ గ్రేషియా, గాయపడ్డ వారికి వైద్యం ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. రామంతా ఘటన చాలా బాధాకరం.. చనిపోయినవారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. మరో 100 మీటర్లలో శోభాయాత్ర ముగుస్తుందనగా ఈ విషాద ఘటన జరగడం దురదదృష్టకరం అన్నారు. కేబుల్ వైర్ ద్వారా కరెంట్ సరఫరా కావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై హైదరాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో పూర్తి విచారణకు ఆదేశించినట్లు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. రిపోర్టు వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ లో కేబుల్ వైర్లపై స్పెషల్ డ్రైవ్ కు ఆదేశాలు జారీ చేశారు మంత్రి శ్రీధర్ బాబు.. కేబుల్ వైర్లు, కరెంట్ వైర్లు కలిసి ఉండటం వల్ల ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉన్నందున స్పెషల్ డ్రైవ్ లో పరిష్కారానికి మార్గం వెతకాలని ఆదేశించారు.

# బీసీ బిల్లుకు మోదీ, కిషన్ రెడ్డి అడ్డు పడుతున్నారు

- జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ రాలె!
- బీసీ రిజర్వేషన్లకు కేసీఆర్ చేసిన చట్టమే అడ్డంకి అయ్యింది
- 2018 చట్టాన్ని సవరించాం.. ఆర్డినెన్స్ తీసుకొచ్చాం
- ఐదు నెలలుగా బిల్లు, ఆర్డినెన్స్ పై రాష్ట్రపతి సంతకం చేస్తలె
- మోదీ, కిషన్ రెడ్డి అనుకుంటే బీసీలకు 42% రిజర్వేషన్లు
- ఓటు దొంగల భరతం పట్టాలె.. రాహుల్ పోరుకు అండగా నిలుద్దాం
- గ్రామాలకు వెళ్లి మీ ఓటును చెక్ చేసుకోండి
- సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**బీసీ రిజర్వేషన్ల కోసం ఎంత వరకైనా పోరాడుతామన్నారు సీఎం రేవంత్. బీసీ బిల్లుకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డు పడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని మాజీ సీఎం కేసీఆర్ 2018లో చట్టం తెచ్చారని.. ఆ చట్టాన్ని తొలగించడానికే తాము ఆర్డినెన్స్ తెచ్చామన్నారు రేవంత్. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపన చేసిన సీఎం..అనంతరం రవీంద్ర భారతిలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు.. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. ఆరు నెలలుగా బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థలు నిర్వహించాలంటే చట్టం అడ్డంగికిగా ఉందని చెప్పారు.. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో ధర్నా చేశామన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నేతలు మొండి వాదన చేస్తున్నారని ఫైర్ అయ్యారు సీఎం. తెలంగాణలో 56.33 శాతం వెనుకబబడిన వర్గాల ప్రజలు ఉన్నారని చెప్పారు సీఎం రేవంత్. బలహీన వర్గాల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్ లో ఉందన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు తావు లేదన్నారు రేవంత్. బీసీలు కూడా రాజ్యాధికారంలో భాగం కావాలన్నారు. తాము చేసిన బిల్లులో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు

వివరాలు 2లో..

### ఉక్రెయిన్ పై ఆగని రష్యా దాడులు...

## ఖార్కివ్ పై డ్రోన్ దాడి... పలువురు మృతి



- ఖార్కివ్‌లో నివాస భవనంపై రష్యా డ్రోన్ దాడి
- పసికందుతో సహా ఐదుగురి మృతి, 20 మందికి గాయాలు
- మొన్న కూడా క్షిపణి దాడి.. 8 మందికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర విషాదాన్ని మిగు లుస్తోంది. ఒకవైపు శాంతి చర్చలు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో దాడులు ఆగడం లేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఏడాది వయసున్న పసికందుతో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 2లో..

## స్టాలిన్‌ను మళ్లీ సీఎం కానివ్వను



- వచ్చే ఎన్నికల్లో డీఎంకేను గెలవనివ్వనన్న శశికళ
- రాష్ట్ర పరిస్థితి చూసి నిద్ర పట్టడం లేదంటూ ఆవేదన
- జయలలిత పాలన వేరు... ఇప్పటి పరిస్థితి వేరు అని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర రాజకీయాలు అప్పుడే వేడెక్కాయి.

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో.. అమీర్ పేట్, మైత్రి వనం ఏరియాలు.. మళ్లీ ఇలా అవకుండా రంగంలోకి హైడ్రా !



**హైదరాబాద్ పెన్ పవర్:** అమీర్ పేట్, మైత్రి వనం పరిసర ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం నాడు పర్యటించారు. మైత్రి వనం దగ్గర వరద ఉధృతిని కట్టడి చేయడానికి ఉన్న అవకాశాలను ఆయన పరిశీలించారు. ట్రంక్ లైన్ ఏర్పాటుతో పాటు తాత్కాలిక ఉపశమనానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై హైడ్రా కసరత్తు చేసింది.

అమీర్ పేట్, మైత్రి వనం పరిసరాల్లో వరద కాలువలకు ఉన్న ఆటంకాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.జూబ్లీ హిల్స్, వెంకటగిరి, రహ్మత్ నగర్, యూసఫ్ గూడ, ప్రాంతాల నుంచి కృష్ణ కాంత్ పార్క్ మీదుగా పారే కాలువను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. పై నుంచి వచ్చే వరదను కృష్ణ కాంత్ పార్క్?లో ఉన్న చెరువులోకి మళ్లిస్తే.. వరద ఉధృతిని కొంత కట్టడి చేయొచ్చని హైడ్రా కమిషనర్ అభిప్రాయపడ్డారు. సారథి స్టూడియో నుంచి మధురా నగర్ మీదుగా వచ్చే వరద సమస్యను పరిష్కరిస్తే ఇబ్బందులు ఉండవని అధికారుల ద్వారా హైడ్రా కమిషనర్ తెలుసుకున్నారు.ఆగస్ట్ 4న కురిసిన కుండపోత

వివరాలు 2లో..

## సినీ కార్మికుల సమ్మె.. రంగంలోకి చిరంజీవి

- ప్రతి యూనిట్‌తో విడివిడిగా మాట్లాడిన చిరంజీవి
- వేతనాలు పెంచాలని కోరుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు
- చిరంజీవి తమను పిలిచి మాట్లాడారన్న ఫెడరేషన్ అధ్యక్షుడు

**పెన్ పవర్ డెస్క్:**సినీ కార్మికుల సమ్మె వ్యవహారంలో మెగాస్టార్ చిరంజీవి జోక్యం చేసుకున్నారు. ఆయన ఫెడరేషన్ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి యూనియన్‌తో విడివిడిగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేపు సాయంత్రం సినీ కార్మికుల ఫెడరేషన్‌తో ఫిలిమ్ ఛాంబర్ సమావేశం కానుంది.

**చిరంజీవి మమ్మల్ని పిలిచి మాట్లాడారు**

చిరంజీవితో సమావేశం అనంతరం ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మీడియాతో మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ తాము 15 రోజులుగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈరోజు చిరంజీవి తమను పిలిచి మాట్లాడారని వెల్లడించారు. 24 విభాగాల నుంచి



72 మందితో ఆయన చర్చించారని తెలిపారు. నిర్మాతలు తాము చెప్పేది వినకుండా తమ మీదే నిందలు వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని

వివరాలు 2లో..

## ముంబై గణేశుడికి రూ. 474 కోట్ల బీమా..

- ముంబై జీఎస్‌బీ సేవా మండల్ గణేశుడికి రూ. 474.46 కోట్ల భారీ బీమా
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన ఇన్సూరెన్స్ కవరేజీ
- విపరీతంగా పెరిగిన బంగారం, వెండి ధరలే ప్రధాన కారణం
- స్వామివారికి 66 కిలోల బంగారం, 336 కిలోల వెండి ఆభరణాలు
- సిబ్బంది, వాలంటీర్ల కోసమే రూ. 375 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా
- భక్తులు, మండపం రక్షణకు మరో రూ. 30 కోట్ల కవరేజీ



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోనే అత్యంత సంపన్న గణేష్ మండలిగా పేరుగాంచిన ముంబై కింగ్స్ సర్కిల్‌లోని జీఎస్‌బీ సేవా మండల్, ఈ ఏడాది గణేష్ చతుర్థి ఉత్సవాల కోసం భారీ బీమా చేయించింది. ఈ సంవత్సరం ఏకంగా రూ. 474.46 కోట్ల విలువైన బీమా పాలసీని తీసుకోవడం విశేషం. గత ఏడాది


వివరాలు 2లో..

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు

- ఓబుళాపురం మైనింగ్ కేసులో నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- నిర్దోషులుగా తేల్చుతూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన సీబీఐ
- సబితతో పాటు మాజీ ఐఏఎస్ కృపానందకు నోటీసులు జారీ

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ అయ్యాయి. వీరిద్దరిని

వివరాలు 2లో..






## నేడు తీరాన్ని దాటనున్న వాయుగుండం... ఏపీకి వర్ష సూచన

- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటే సూచన
- కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలకు ఛాన్స్
- తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో గాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోంది. ఇది మంగళవారం ఉదయానికి వాయుగుండంగా

వివరాలు 2లో..



## సినీ పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జాతీయ అవార్డు గ్రహీతల భేటీ.. పరిశ్రమ అభివృద్ధిపై చర్చ
- జాతీయ అవార్డు విజేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం
- భారత సినిమా నిర్మాణానికి హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామన్న సీఎం
- సినీ పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ
- పరిశ్రమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన సినీ ప్రముఖులు
- అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించిన ముఖ్యమంత్రి
- భేటీలో పాల్గొన్న పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు

వివరాలు 2లో..



**హైదరాబాద్ పెన్ పవర్:**భారత చలనచిత్ర నిర్మాణానికి హైదరాబాద్ నగరాన్ని ఒక ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా సినిమా పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో అవార్డులకు ఎంపికైన పలువురు తెలుగు సినీ ప్రముఖులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అవార్డు విజేతలందరినీ అభినందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం సినీ ప్రముఖులతో కాసేపు ముచ్చటించారు. ఈ భేటీలో

## ఎడిటర్ వ్యూ

# యుద్ధానికి తెరపడేదెన్నడు.. ఇలా ఎన్నాళ్లు

తాడిపత్రి నియోజకవర్గం ఎప్పుడూ వార్తల్లోనే ఉంటుంది. అక్కడ ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ నిత్యం రగులుతూనే ఉంటుంది. మాజీ ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డిల మధ్య సవాళ్ల పర్వం నిత్యం నడుస్తూనే ఉంటుంది. ఈరోజుతో మొదలయిన యుద్ధం కాదిది. కొన్ని దశాబ్దాల నుంచి జరుగుతున్న వార్ కావడంతో దీనికి తెరపడే అవకాశం లేదన్నది వాస్తవం. అధికారంలో ఉన్నవాళ్లు రెచ్చిపోవడం, ప్రతిపక్షంలో ఉన్నవాళ్ల కొంత తగ్గుతుండటం ఇక్కడ మామూలుగానే కనపడుతుంది. 2019 ఎన్నికల వరకూ జేసీ కుటుంబానిదే తాడిపత్రిలో ఆధిపత్యం నడిచేది. అయితే ఆ ఎన్నికల్లో తొలిసారి అక్కడ వైసీపీ జెండా ఎగిరింది. కేతిరెడ్డి పెద్దారెడ్డి విజయం సాధించడంతో మొదలయిన యుద్ధం నేటికీ ముగియలేదు.

**జేసీ కుటుంబం గెలవడంతో...**

మొన్నటి ఎన్నికల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యేగా తాడిపత్రిలో విజయం సాధించారు. ఇక అప్పటి నుంచి జేసీ ప్రభాకర్ రెడ్డి హవా మొదలయింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై తన అనుచరులతో కలిసి దాడి చేయడమే కాకుండా ఫర్నీచర్ ను కూడా ధ్వంసం చేశారు. వాహనాలతో పాటు ఫర్నీచర్ ను కూడా తగులపెట్టారు. ఆ సమయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో లేరు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎక్కువ సమయం జేసీ ప్రభాకర్ రెడ్డి కుటుంబం హైదరాబాద్ లోనే ఉండేది. ఇప్పుడు తాడిపత్రిలో జేసీ కుటుంబం చేతిలోకి మళ్లీ రావడంతో ఆయన ఇక పెద్దారెడ్డిని అడుగుపెట్టనివ్వడం లేదు.

**అడ్డుకున్నప్పటికీ...**

తాడిపత్రికి వచ్చేందుకు అనేకసార్లు కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రయత్నించినా పోలీసులు శాంతి భద్రతల సమస్య పేరు చెప్పి అడ్డుకున్నారు. ఆయనను జిల్లాలోని వేరే ప్రాంతానికే పరిమితం చేశారు. అయితే పెద్దారెడ్డి మాత్రం హైకోర్టుకు వెళ్లి మరోసారి ఆదేశాలు తెచ్చుకున్నారు. పోలీసులే దగ్గరుండి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకెళ్లాలని, ఆయనకు భద్రతను కల్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి చేరుకోనున్నారు. మరొకవైపు జేసీ ప్రభాకర్ రెడ్డి కూడా ఈరోజు తాడిపత్రిలో శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమాన్ని పెట్టారు. దీనికి పెద్దయెత్తున కార్యకర్తలు తరలి రావాలని కోరారు. దీంతో తాడిపత్రి లో టెన్షన్ నెలకొంది. పోలీసులు ఇద్దరి మధ్య నలిగిపోతున్నారు. కానీ మరోసారి పెద్దారెడ్డిని అడ్డుకోవడంతో ఆయన రాకపోవడంతో కొంత పరిస్థితులు సద్దుమణిగాయని పోలీసులు చెబుతున్నారు. మరోసారి జేసీ ప్రభాకర్ రెడ్డి దమ్ముంటే తాడిపత్రికి రా అని ఛాలెంజ్ విసిరారు.

# బీసీ బిల్లుకు మోదీ, కిషన్ రెడ్డి అడ్డు పడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఉంటే చూపించాలన్నారు సీఎం.సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడన్నారు సీఎం రేవంత్ రెడ్డి. సర్వాయి పాపన్నకు సరైన గుర్తింపు ఉండాలి..అది ఈ రోజు నెరవేరబోతుంది. పాపన్న విగ్రహం తెలంగాణ సామ్రాజ్యానికి స్ఫూర్తిగా ఉండబోతోంది. . ఆనాడే బహుజన సామ్రాజ్యాన్ని నిర్మించిన యోధుడని చెప్పారు. ఖిలా షాపూర్ కోటను గత ప్రభుత్వం మైనింగ్ లీజుకు ఇచ్చిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఖిలా షాపూర్ కోట పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రపంచంలోనే ఇండియా మొదటి స్థానంలో ఉండాలని సోనియా గాంధీ ప్రధాన మంత్రి పదవిని త్యాగం చేశారని చెప్పారు సీఎం రేవంత్ . భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కావడానికి గాంధీ కుటుంబం కారణమని అన్నారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం అని అన్నారు. తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని

చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు రేవంత్. ఎన్నో అడ్డంకులు వచ్చినా కులగణన చేసి చూపించాం. తాము చేసిన పనిలో తప్పు ఉంటే చేసి చూపించమని చెప్పామన్నారు. ఎన్నో సార్లు మేధావులతో సమావేశమై చర్చించిన తర్వా కులగణన చేశామన్నారు.

# హైదరాబాద్‌లో.. అమీర్ పేట్, మైత్రి వనం ఏరియాలు.. మళ్లీ ఇలా అవకుండా రంగంలోకి హైడ్రా !

- మొదటి పేజీ తరువాయి

వానకు అమీర్‌మీట్ మెట్రో ప్రాంతం వరద నీటితో నిండిపోయిన సంగతి తెలిసిందే. మైత్రీవనం దగ్గర భారీగా వరద చేరడంతో మెట్రో స్టేషన్ కింద నడుం వరకు నీళ్లు వచ్చాయి. స్వర్ణ జయంతి కాంప్లెక్స్?దగ్గర కూడా భారీగా నీళ్లు నిలవడంతో వాహనాలు కదల్లేదు. జూబ్లీహిల్స్, కృష్ణానగర్, యూసుఫ్ గూడ, ఎల్లారెడ్డి గూడ ప్రాంతాలతో పాటు మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి భారీగా వరద రావడంతో రోడ్డుపై నీరు నిలిచిందని అధికారులు హైడ్రా కమిషనర్ రంగనాథ్?కు ఇప్పటికే వివరించారు.40 అడుగుల వెడల్పుతో పై నుంచి వచ్చిన వరద కాలువలు అమీర్ పేట, ఎస్ఆర్ నగర్ మెయిన్?రోడ్డు దాటే సమయంలో 10 అడుగులకు కుంచించుకుపోవడంతో ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. అమీర్ పేట మెట్రో స్టేషన్ కింద నిర్మించిన కల్వర్టులో ఉన్న పైపు లైన్లలో ఒకటి పూడికతో మూసుకుపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు.

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

నిర్దోషులుగా తేల్చుస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో తీర్పు వెలువరించింది.సీబీఐ ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఉన్నత న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని వీరిద్దరిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది.గాలి

జనార్ధన్ రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. దోషులకు రూ. 10 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. అలాగే ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ కేసులో, అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రా రెడ్డికి, నాటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందకు సీబీఐ కోర్టులో ఊరట లభించింది. వారిని నిర్దోషులుగా ప్రకటించడంతో సీబీఐ హైకోర్టుకు వెళ్లింది.

# సినీ పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ

- మొదటి పేజీ తరువాయి

సినీ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను, సమస్యలను వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వారి సమస్యలను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో 'భగవంత్ కేసరి' చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, 'హనుమాన్' దర్శకుడు ప్రశాంత్ వర్మ, 'బేబి' దర్శకుడు సాయి రాజేశ్, గాయకుడు రోహిత్ ఉన్నారు. వీరితో పాటు 'హనుమాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పనిచేసిన వెంకట్,

శ్రీనివాస్ బృందంతో పాటు ఫైట్ మాస్టర్లు నందు, పృథ్వీలను కూడా ముఖ్యమంత్రి సన్మానించారు.ఈ కార్యక్రమంలో 'హనుమాన్' నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, 'బేబి' నిర్మాత ఎస్‌కేఎన్, 'భగవంత్ కేసరి' నిర్మాత సాహు గారపాటి తదితరులు పాల్గొన్నారు.

# ముంబై గణేశుడికి రూ. 474 కోట్ల బీమా..

- మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తం రూ. 400 కోట్లుగా ఉండగా, ఈసారి గణనీయంగా పెరిగింది.

**బంగారం ధరలే కారణం**

ఈ బీమా కవరేజీ ఇంత పెద్ద మొత్తంలో పెరగడానికి ప్రధాన కారణం బంగారం, వెండి ఆభరణాల విలువ పెరగడమేనని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం స్వామివారికి అలంకరించే 66 కిలోల బంగారం, 336 కిలోల వెండి ఆభరణాల విలువ అధికంగా ఉంది. గత సంవత్సరం 10 గ్రాముల బంగారం ధర రూ. 77,000 ఉండగా, ప్రస్తుతం అది రూ. 1,02,000కి చేరింది. ఈ కారణంగానే కేవలం ఆభరణాల రక్షణ కోసం తీసుకున్న 'ఆల్-రిస్క్' పాలసీ విలువ గత ఏడాది రూ. 43 కోట్ల నుంచి ఈసారి రూ. 67 కోట్లకు పెరిగింది.ల

**విభాగాల వారీగా బీమా వివరాలు**

ఈ మొత్తం రూ. 474.46 కోట్ల పాలసీలో అధికభాగం వాలంటీర్లు, పూజారులు, వంట సిబ్బంది, భద్రతా సిబ్బంది వంటి వారి వ్యక్తిగత ప్రమాద బీమా కోసమే కేటాయించారు. దీని విలువ రూ. 375 కోట్లుగా ఉంది. మండపానికి వచ్చే భక్తులు, పండల్, ఇతర నిర్మాణాల రక్షణ కోసం ప్రజా బాధ్యత (పబ్లిక్ లయబిలిటీ) కింద రూ. 30 కోట్ల కవరేజీని తీసుకున్నారు. అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కోసం తీసుకున్న బీమా విలువలో మార్పు లేదు. ఇది గత సంవత్సరం మాదిరిగానే రూ. 2 కోట్లుగా ఉంది. అదనంగా, ఉత్సవాలు జరిగే ప్రాంగణం కోసం మరో రూ. 43 లక్షల పాలసీని కూడా తీసుకున్నట్లు న్యూ ఇండియా అస్యూరెన్స్ సంస్థ వెల్లడించింది.

# నేడు తీరాన్ని దాటనున్న వాయుగుండం... ఏపీకి వర్ష సూచన

- మొదటి పేజీ తరువాయి

మారి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ వాయుగుండం కారణంగా మంగళవారం కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.ఇప్పటికే అల్పపీడన ప్రభావంతో

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అత్యధికంగా 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో 66 మి.మీ, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 60.2 మి.మీ, అల్లూరి జిల్లా కొత్తూరులో 59.5 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

## ఉక్రెయిన్ పై ఆగని రష్యా దాడులు... ఖార్కివ్ పై డ్రోన్ దాడి... పలువురు మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో ఉక్రెయిన్ మరోసారి ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే, ఈరోజు ఖార్కివ్‌లోని ఓ ఐదంతస్తుల నివాస భవనంపై రష్యా డ్రోన్‌తో దాడి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు పౌరులు మరణించగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి, శిథిలాల కింద చిక్కుకున్న ఓ యువకుడిని, యువతిని సురక్షితంగా బయటకు తీశాయి. ఈ దాడికి కొన్ని గంటల ముందు, అంటే నిన్న సాయంత్రం కూడా ఖార్కివ్‌పై రష్యా క్షిపణి దాడికి పాల్పడింది. ఆ ఘటనలో 13 ఏళ్ల బాలుడితో సహా ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు పేర్కొన్నారు.

మరోవైపు, గత శుక్రవారం రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ఒకరు మరణించగా, 10 మంది గాయపడినట్లు రష్యా ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌స్టెయిన్ తెలిపారు. నగరంలోని రైల్వే జిల్లాలో ఉన్న ఓ భవనంపై డ్రోన్ దాడి జరగడంతో పై నాలుగు అంతస్తుల్లో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఇలా ఇరు దేశాలు దాడులతో రెచ్చిపోతున్న తరుణంలోనే, ఆగస్టు 15న అమెరికాలోని అలస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక సమావేశం జరిగింది. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో ప్రధానంగా ఉక్రెయిన్ యుద్ధంపైనే దృష్టి సారించారు. ఈ భేటీ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. కాల్పుల విరమణ కాకుండా, ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష శాంతి ఒప్పందం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. దౌత్యపరమైన చర్చలతో లక్షలాది ప్రాణాలను కాపాడవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్టాలిన్‌ను మళ్లీ సీఎం కానివ్వను

- మొదటి పేజీ తరువాయి

ఏఐఏడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి ఆమె తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీని గెలవనివ్వబోనని, స్టాలిన్‌కు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వనని ఆమె శపథం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై శశికళ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అమ్మ' జయలలిత హయాంలో తమిళనాడు ఎంతో అభివృద్ధి సాధించిందని, కానీ నేటి పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని ఆవేదన చెందారు. "ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే నాకు రాత్రిళ్లు నిద్ర కూడా సరిగా పట్టడం లేదు. మేం ప్రజలకు మంచి పాలన అందించాం. అందుకే ఇప్పటి పరిస్థితులు చూస్తే ఆ బాధ ఎలా ఉంటుందో మాకే తెలుసు. స్టాలిన్, మిమ్మల్ని మరోసారి అధికారంలోకి రానివ్వను" అని ఆమె స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా, గత ఏఐఏడీఎంకే ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయాన్ని కూడా శశికళ తప్పుపట్టారు. పారిశుద్ధ్య కార్మికుల వ్యవస్థను ప్రైవేటీకరించడం సరైన చర్య కాదని ఆమె విమర్శించారు. జయలలిత జీవించి ఉంటే అలాంటి నిర్ణయానికి ఎప్పటికీ అంగీకరించేవారు కాదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## సినీ కార్మికుల సమ్మె.. రంగంలోకి చిరంజీవి

- మొదటి పేజీ తరువాయి

ఆయన తెలిపారు. సాధ్యం కాని, అమలు చేయలేని నిబంధనలు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పాటు నిర్మాతలు కూడా బాగుండాలని, కానీ నిర్మాతలు పెట్టిన రెండు షరతులకు తాము ఒప్పుకుంటే నష్టపోతామని అనిల్ అన్నారు. ఈ విషయాన్ని చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.'మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరకు రండి' అని చిరంజీవి తమకు భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ఛాంబర్ నుంచి కూడా తమకు పిలుపు వచ్చిందని అన్నారు. చర్చలకు పిలిచారు కాబట్టి తాము ప్రస్తుతానికి నిరసన కార్యక్రమం ఆపేశామని తెలిపారు. తాము అడిగినట్లు వేతనాలు వస్తాయని భావిస్తున్నామని అన్నారు.

## తాడిపత్రిలో హైటెన్షన్.. రోడ్డుపైనే కుర్చీ వేసుకుని కేతిరెడ్డి నిరీక్షణ

- మొదటి పేజీ తరువాయి

అనుమతి నిరాకరించారు. దీంతోపాటు టీడీపీ కార్యకర్తలు కూడా ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు.పోలీసుల చర్యతో ఆగ్రహానికి గురైన పెద్దారెడ్డి, అక్కడే రోడ్డుపై కుర్చీ వేసుకుని బైఠాయించారు. తాడిపత్రిలోకి తనను అనుమతించే వరకు కదిలేది లేదని తేల్చిచెప్పారు. ఆరు గంటలకు పైగా అక్కడే ఉండిపోయిన ఆయన, భోజనం కూడా అక్కడే చేశారు. ఆయనకు మద్దతుగా వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పోలీసులతో వాగ్వాదానికి దిగారు.ఈ పరిణామాలపై జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. కేతిరెడ్డికి కోర్టు ఆర్డర్ ఉన్నా, ఆయన బాధితులు మాత్రం ఊరిలోకి రానివ్వరని అన్నారు. గతంలో పొట్టి రవి విషయంలోనూ కోర్టు ఆదేశాలున్నా పెద్దారెడ్డే పోలీసులను అడ్డం పెట్టుకుని అడ్డుకున్నారని జేసీ ఆరోపించారు. తాము కోర్టును గౌరవిస్తామని, కానీ ప్రజలు మాత్రం పెద్దారెడ్డిని అడ్డుకోవడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా తాడిపత్రి సరిహద్దుల్లో 750 మందికి పైగా పోలీసులను మోహరించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి రోడ్డుపైనే నిరీక్షిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# అధైర్య పడవద్దు అధికార యంత్రాంగం అండగా ఉంది కలెక్టర్



హైదరాబాద్ పెన్ పవర్: మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బోడ్మాట్ పల్లి గ్రామంలో వరద నీరు ఇండ్లలోకి చేరిన సందర్భంలో పాడైన నిత్యవసర వస్తువులను పరిశీలించిన మెదక్ జిల్లా కలెక్టర్ తక్షణ సహాయ సహకారాలపై దృష్టి సారించాలని టేక్మాల్ తాసిల్దార్ ను ఆదేశించారు. టేక్మాల్ మండలం బోడ్మాట్ పల్లి గ్రామంలో నిన్న అనగా ఆదివారం రాత్రి వర్ష నీరు ఇంటిలోకి వచ్చిన బాధితుల ఇంటికి వెళ్లిన వివరాలు తెలుసుకున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. మెదక్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్న నేపద్యంలో టేక్మాల్ మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. నిన్న రాత్రి ఎడతెరిపి వాన కురవడంతో వర్షపు నీరు పెద్ద ఎత్తున రావడంతో మండలంలో కుంటలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇందులో భాగంగా వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేస్తూ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయక చర్యలపై అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. వరద నీరు ఇండ్లలోకి చేరిన సందర్భంగా వాటిని తొలగించే ఏర్పాటు చేయాలని పాడైన నిత్యవసర వస్తువులను అంచనా వేసి తక్షణ సహాయ సహకారాలపై దృష్టి సారించాలని కలెక్టర్ ఈ సందర్భంగా తాసిల్దారుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న 375 జయంతిని ఘనంగా జరిపారు.

పెబ్బేరు మండల గౌడ సంఘం



హైదరాబాద్ పెన్ పవర్: పెబ్బేరు మండల కేంద్రంలోసోమవారం రోజు సర్దార్ సర్వాయి పాపన్న 375 వ జయంతిని కార్యక్రమాన్ని మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ 300 సంవత్సరాల క్రితమే వీరోచిత పోరాటం చేసి తెలంగాణ బహుజన తెలంగాణ బహుజన పోరాటయోధుడు యోధుడు అణగారిన పేద బడుగు వర్గాలపై నవాబులు యల్మా దొరలు చేస్తున్న అరాచకాలపై పోరాటం చేసిన మహా వీరుడు అగ్రవర్ణాలే రాజ్యపాలన ఎందుకు చేయాలి అనే సంకల్పంతో మన రాజ్యాన్ని మనమే ఏలుకుందాం అన్ని వర్గాల ప్రజలను సమకూర్చి 12వేల సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణ కోటపై బహుజనుల రాజ్యము ఏర్పాటు చేశారు. కనుక బడుగు వర్గాలందరూ సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తిని తీసుకొని పోరాటం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయడం అయినది. ఈ కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్ గౌడ్,ఎస్ రామన్ గౌడ్, జి వెంకటేశ్వర్ గౌడ్( ఎన్ ఆర్ జీ) రాఘవేందర్ గౌడ్,జి నరసింహ గౌడ్, జనార్దన్ గౌడ్, మహేందర్ గౌడ్,బసవరాజ్ గౌడ్, రంగస్వామి గౌడ్,సురేందర్ గౌడ్, నీరుగంటి వెంకటేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,రమేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, మోహన్ గౌడ్,ఉమేష్ గౌడ్,శివశంకర్ గౌడ్,పి వెంకటేశ్వర్ గౌడ్,శేఖర్ గౌడ్ కృష్ణ గౌడ్,రామన్ గౌడ్,వెంకటయ్య గౌడ్,సాయి గౌడ్, బత్తుల అనిల్ కుమార్ గౌడ్, గుండ్రాతి రాకేష్ గౌడ్, గుండ్రాతి బాలా గౌడ్,బాధగౌని కళ్యాణ్ గౌడ్, అల్వాల ప్రవీణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# దన్నూర చెరువు కట్టపై టేక్మాల్ జోగిపేట రహదారి పై ప్రవహిస్తున్న నీరు





హైదరాబాద్ పెన్ పవర్: మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ధన్నారం బసవన్న చెరువు నిన్న రాత్రి కురిసిన వర్షానికి ఆ చెరువులోనికి వర్షపు నీరు వరద అన్ని కలిసి నిండుకుండలా మారింది ఆ గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఎప్పుడు ఏ క్షణం అన్నట్లు గ్రామ ప్రజలు ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నారు, ఈ గ్రామం మీదుగానే పటాన్చెరు టు టేక్మాల్ బస్సు సౌకర్యం ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితులలో ఆ గ్రామమే జలదిగ్బంధమై ఉంది. ఓవైపు మంజీరా నది, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి అధికారులు ప్రజాప్రతినిధులు బసవన్న చెరువు పరిస్థితిని పట్టించుకోగలరు అని దన్నరం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పరస్పర ఆరోపణల తో ముగిసిన మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం..



హైదరాబాద్ పెన్ పవర్:
కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం ఆరోపణలు, ప్రత్యరోపణల మధ్య ముగిసింది. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరం నందు చైర్మన్ డా, కె ఎస్ రఘు అధ్యక్షతన వైస్ చైర్మన్ లు డి. నజీర్ అహ్మద్, దివ్యకళ,వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్ ఎన్. గంగిరెడ్డి, ఆయా శాఖలు అధికారులు పాల్గొని మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.
ముందుగా వైస్ చైర్మన్ డి. నజీర్ అహ్మద్ లేచి అజెండా లోని పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపుతూ ఎమ్మిగనూరు పట్టణానికి ఎన్నో విలువైన స్థలాలను ఇచ్చిన దాత హాసన్ బేగ్ విగ్రహాన్ని,బాబు జగజ్జీవన్ రాం విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం వార్డు కౌన్సిలర్ పి టి కేశవ రెడ్డి తమ వార్డు లోని సమస్యలను పరిష్కారించాలని కోరారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ రామదాసు గౌడ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ, మహిళల కోసం ఉచిత బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి కి, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదములు తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం లో భాగంగా 38వేల మంది రైతులకు రైతు భరోసా నిధులు వారి ఖాతాలలో వేశామని, అందుకు కూటమి ప్రభుత్వం నకు ధన్యవాదములు తెలిపారు.అనంతరం కౌన్సిలర్ శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ను బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అన్ని మోసం అని ఏ ఒక్కటీ సరిగా అమలు కాలేదని, ప్రజలే చెబుతున్నారని మాట్లాడుతుండగానే పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ, మాటమాట పెరిగి చైర్మన్ పోడియం వద్దకు దూసుకుని వచ్చి ఒకరినొకరు తోసుకున్నారు. అంతలోనే చైర్మన్ తీవ్రంగా మందలించడం తో సద్దుమణిగింది. అనంతరం చైర్మన్ ను పిలువకుండా నే టీడీపీ నూతన ఫ్లోర్ లీడర్ గా ఎన్నికైన రామదాసు గౌడ్ ను శాలువా, పూలమాలతో టీడీపీ కౌన్సిలర్ లు సన్మానించారు.

# బహుజన రాజ్యాధికార దిక్సూచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



హైదరాబాద్ పెన్ పవర్: గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగని యాదగిరి గౌడ్ మాట్లాడుతూ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనాగని యాదగిరి, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు డా,,చిర్ర రాజు, బీసీ జాక్ చైర్మన్ సంగం రెడ్డి సుందర యాదవ్ మాట్లాడుతు దాదాపు 300 సంవత్సరాల క్రితమే సబ్బండ వర్గాలైన 12 మంది సైన్యంతో మొదలైన గెరిల్లా యుద్ధం దాదాపుగా 1200 మంది సైన్యం తయారు చేసుకొని ఆనాటి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దాదాపుగా 22 కోటలు నిర్మించిన బహుజన తొలి చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గోల్కొండ కేంద్రంగా ఏడు నెలలు పరిపాలన కొనసాగించాడని నేటితరం అదే స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం అడుగులు వేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మానస,డిఆర్ఓ గణేష్,బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు శ్యామ్ యాదవ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జనగాని శ్రీనివాస్ గౌడ్, మార్క విజయ్ గౌడ్,బూర విద్యాసాగర్ గౌడ్,బిసి విద్యావంతుల వేదిక నాయకులు వేణు గౌడ్,మౌనిక గౌడ్ ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాపన్నకు గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది.

# స్వేరో స్టూడెంట్స్ యూనియన్ భారీ రాస్తారోక్

- స్వేరో(ఎస్ ఎస్ యు) హనుమకొండ జిల్లా అధ్యక్షులుఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ
- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ కొందరి వాడు కాదు, అందరివాడు:-
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వేమురి రాధాకృష్ణ గారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి బహిరంగ క్షమాపణ చెప్పాలి:-ధర్నా చేయడం జరిగింది.
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి దళిత నాయకుడు అనే ముద్ర వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.




హైదరాబాద్ పెన్ పవర్: డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ గారిని ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ సాయంత్రం ఏడు గంటలకు డిబేట్ లో పాల్గొనమని చెప్పి ఏబీఎన్ న్యూస్ ఛానల్ లో ట్రోలింగ్ దళిత నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు అని మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ గారు కేవలం దళితుల కోసమే పనిచేయడం లేదని ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ అధిపతి అయినటువంటి ఆంధ్రప్రదేశ్ వేమురి రాధాకృష్ణన్ గారికి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ఎంతో మంది పేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు అగ్రవర్ణాల్లో పేదల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడిని దళిత నాయకుడు అనే ముద్ర వేయడాన్ని సిగ్గుచేటుగా భావిస్తున్నాను, అదేవిధంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు తన ఉద్యోగ వృత్తిలో ఉన్నప్పుడు ఎంతోమంది పేదలకు కులాలకు,మతాలకు అతీతంగా సభ్యండ వర్గాలకు మేలు చేసిన వ్యక్తి ని పట్టుకొని ఈ రోజు ఆంధ్రజ్యోతి మెయిన్ స్ట్రీమ్ మీడియా దళిత నాయకుడు అని అవమానిస్తున్న వేముల రాధాకృష్ణ తన మీడియా ద్వారా బహిరంగంగా క్షమాపణలు కోరాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ ఉద్యమంలో తను పోలీస్ ఉద్యోగంలో వండుకుంటూ తెలంగాణ వాదం వైపు నిలిచిన వ్యక్తి ఎంతోమంది తెలంగాణ కోసం అమరులైన విద్యార్థుల శవాలను తన భుజాల మీద మోసిన వ్యక్తి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అదేవిధంగా ఎవరెస్టు శిఖరం ఎక్కించిన మలవతు పూర్ణ ,ఆనందుల విజయాన్ని కూడా తనకే దక్కుతుంది ,అంతేకాకుండా ఎంతోమంది విద్యార్థులను అజీమ్ ప్రేమ్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, ఐఏఎస్ ఐపీఎస్ , పైలెట్ మరియు ఇతరాంతర ఉద్యోగాలు పొందే విధంగా తయారుచేసిన వ్యక్తి ఆర్ ఎస్ పి ఇతర దేశాలకు పై చదువుల కొరకు పంపించిన ఘనత కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి దక్కుతుంది ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అదేవిధంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ గారు ఒక్కసారి తన మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వేసేముందు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారి యొక్క స్టేటస్ ఏంది తన ఉద్యోగ వృత్తిలో ఏ విధంగా పని చేసిండు రాజకీయ రంగంలోకి వచ్చాక ఎలా పనిచేస్తున్నాడో కూడా గమనించాల్సిన అవసరం ఉంది తాను స్వేరోస్ నెట్వర్క్ ను స్థాపించి ఇతర దేశాలలో కూడా ఆ నెట్వర్క్ ను విస్తరించి పేద ప్రజల పక్షాన అండగా నిలుస్తున్న స్వేరోస్ నెట్వర్క్ ఘనత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి దక్కుతుంది తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు చెట్టుపల్లి శివకుమార్, బన్నీ, వంశీ, శ్రావణ్, కృష్ణ ,రాజేష్, సురేష్, కిరణ్, మహేష్, రాకేష్, సుఖేష్, సిద్దు ,ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగా ణ బహుజన వీరుడు, ఆత్మగౌర వానికి, ధీరత్వానికి సర్దార్ సర్వా యి పాపన్న గౌడ్ ప్రతీక అని పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినే టర్ పులి రజినీకాంత్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని బాలసముద్రం పార్టీ ఆఫీసు కార్యాలయంలో సోమవారం రోజున నిర్వహిం చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయ కులు మూటిక రాజు యాదవ్, సుధాకర్, వినీల్ రావు, చాగంటి రమేష్, రఘు, శ్రీనివాస్ , భైరపాక ప్రశాంత్, దేవమ్మ, అజయ్ గౌడ్, పాల్గొన్నారు

# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు నిమ్మ రమేష్**
**యువజన కాంగ్రెస్ మండల అద్యక్షులు సంగమేశ్వర్ గౌడ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యొక్క 375 వ జయంతి ఉత్సవాలు టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక గాంధీ భవన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల పార్టీ అద్యక్షులు నిమ్మ రమేష్, యువజన కాంగ్రెస్ అద్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు, ఆకులపల్లి పాపయ్య, రాజేష్ గౌడ్, నాయికోటి భాస్కర్, షేక్ మజర్, చింత రవి, కమ్మరి సిద్దన్న, అశిలి సాగర్, చల్ల అనిల్, సేవాలాల్, సక్రు నాయక్, సర్దార్, సంతోష్, వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు, మనోహర్ గౌడ్, సత్య గౌడ్, అనిల్ గౌడ్, తుకారం గౌడ్, నగేష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, రాజు గౌడ్, సంపత్ గౌడ్, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..

# కొత్త బ్లాక్ లో ఉన్న పరికరాల భద్రత కోసమే తాళం..

- ఓటి (ఆపరేషన్ థియేటర్) ఓల్డ్ బ్లాక్ లోనే ఉన్నాయి..
- తప్పుడు సంకేతాలు ఇవ్వకుండా.. మంచిని ముందుకు తీసుకెళ్లాలి..
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి.




**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త బ్లాక్ లో ఉన్న పరికరాల భద్రత కోసమే వందపడకల ఆసుపత్రి కి తాళం వేసిందని, పాత బ్లాక్ లో ఓటి (ఆపరేషన్ థియేటర్) లోనే ఉన్నాయి కాబట్టి అక్కడ వైద్య సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక ఆసుపత్రిలో ఎమ్మెల్యే అధ్యక్షతన వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో కలసి హెచ్ డిబి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రస్తుతం ఓటి (ఆపరేషన్ థియేటర్) ఓల్డ్ బ్లాక్ లోనే కొనసాగుతున్నాయని, కొత్త బ్లాక్ లో ఉన్న పరికరాల భద్రత కోసం సిబ్బంది గదికి తాళం వేశారని, దీన్ని కొందరు ఆస్పత్రికి తాళం వేశారని తప్పుడు ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. నిన్నటి రోజు (ఆదివారం) నాడు ఆస్పత్రిలో ఏడు డెలివరీ, ముగ్గురికి ఎం.ఎల్.సీ (మెడికల్ లీగల్ కేసు), ఓపి 79 మందికి సేవలందించారని, అలాగే ఒక పోస్టుమార్టం కూడా చేశారని వివరించారు. తప్పుడు ప్రకటన ద్వారా ఆస్పత్రి ప్రతిష్ట దెబ్బ తింటుందని, వాస్తవాలు తెలుసుకొని చూపించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఇక్కడి వైద్యులు మంచి సేవలు అందిస్తున్నారని, ఇంకా కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వానికి ప్రతిపాదన పంపడం జరిగింది తెలిపారు. గత కాంట్రాక్టర్ ఆసుపత్రిలో ఓపి గది కట్టకుండా నిర్మాణం చేసి వెళ్లిపోయారని కూటమి ప్రభుత్వం వచ్చాక తాను ఓపి గది ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరోపక్క ఇక్కడకు ఫిజీషియన్ వైద్యులను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఎమ్మిగనూరు ఆసుపత్రి డెలివరీలో మొదటి స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్ కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో కావాల్సిన సిబ్బందిని పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు సంకేతాలు ఇవ్వకుండా ప్రజలకు మంచి జరిగే విషయాలు కూడా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సూపరెండెంట్ సుధా, వైద్యులు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావాణికి 65 దరఖాస్తులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలి.ప్రజాల సమర్పించిన ఆర్జీలపై సత్వరమే స్పందించాలి జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి.
ప్రజాల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి,వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలి నేని మను చౌదరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె. ఎల్ .బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఆర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, దరఖాస్తుల పై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు.ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన ఆర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.పెండింగ్ లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి,త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సోమవారం రోజున ప్రజావాణిలో 65 ఆర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు,రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ,ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అహ్మద్ గూడ 2 బి హెచ్ కె లో రిలే నిరాహార దీక్షలు





**హైదరాబాద్ పెన్ పవర్:**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల్ దమ్మైగూడ మున్సిపాలిటీ, పరిధిలో ఉన్న అహ్మద్ గూడా 2బి హెచ్ కె లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఫేస్ వన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు విజయ్ కుమార్, షేక్ తెలియజేశారు. ఈ రిలే నిరాహార దీక్షలకు సిఐటియు కీసర మండల నాయకులు బంగారు నర్సింగరావు అధ్యక్షత వహించి ఈ సందర్భంగా మాట్లాడుతూ హమ్మద్ గూడా డబల్ బెడ్ రూమ్ ప్రాంతంలో సరైన మౌలిక సదుపాయాలు లేవని ఇక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని గతంలో సంబంధిత అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు చేసిన పిడచెవిన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరేటర్లు ఏర్పాటు చేయాలి,సౌకర్యాలు మెరుగుపరచాలి, లీకేజీలను నివారించే మరమ్మత్తులు చేయాలి. ఈ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత్యంతరం లేని పరిస్థితిలో ఈ రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నామన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలకు ముఖ్యఅతిథిగా సిపిఎం తెలంగాణ రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకులు డీజే నరసింహా రావు దీక్ష ప్రారంభ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికల దృష్టిలో పెట్టుకొని హడావుడిగా ఇళ్ల పంపిణీ చేసిందన్నారు. సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండానే అసంపూర్తిగా నిర్మించిన ఇళ్ళకు గృహప్రవేశాలు చేయించి ఇళ్ల తాళాలు చేతులో పెట్టి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ఒక ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేసి ప్రణాళిక రూపొందించి తగిన బడ్జెట్ కేటాయించి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి పి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు లక్ష డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించింది. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసారు. నాణ్యత ప్రమాణాలు పట్టించుకున్న పాపాన లేదు. తూతూ మంత్రంగా నాసిరకంగా పూర్తి చేసి ఎన్నికల ముందు ఎలాంటి ఎంక్వయిరీ లేకుండా లాటరీ పద్ధతిలో ఓట్ల కోసమే తప్ప పేదలకు మంచి చేయాలని ఉద్దేశం లేకుండా పోయింది. నాణ్యత ప్రమాణాలు లేకపోవడం మూలంగానే బిల్డింగులకు పగుళ్లు ఏర్పడి ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నావీ. హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన డి ఈ సి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కన్స్ట్రక్షన్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 2బి హెచ్ కె పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అసంపూర్తిగా వదిలేసిన పనులను సంస్థ సొంత ఖర్చులతో పూర్తి చేయాలన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలి.లేని పక్షంలో ఈ నెల 25వ తేదీన కలెక్టర్ కార్యాలయము ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలియజేసి మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలను పేదలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని మహిళలకు ఇచ్చిన ఇళ్లకు మాత్రం మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదన్నారు. ప్రజా అవసరాలైన రేషన్ షాపుల ఏర్పాటు అంగన్వాడి కేంద్రాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి సక్రమంగా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మంగళ పూరి వెంకటేష్, అహ్మద్ గూడా ఫేస్ వన్ కమిటీ నాయకులు వై పరశురాం, ఎం.మోహన్, యాస్మిన్, ఎండి పాషా, పి. నాగరాజు, బి. మోజస్,బి. వెంకటేష్, ఝాన్సీ ప్రియ, అనురాధ, చాంద్, శ్రీనివాస్, రమణ,ఆరిఫ్,దయాకర్ యాకన్న ప్రజాం్తి, జ్ఞానేశ్వర్,కేవీపీఎస్ జిల్లా నాయకులు చింతల అశోక్, ఐద్వా జిల్లా నాయకురాలు కంబాల పూజ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి వేడుకలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి వేడుకలు గ్రామ పెద్దలు మాట్లాడుతూ... బహుజన చక్రవర్తి.. తమ ఉద్యమ పటిమతో మొగల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై ప్రజాస్వామిక జండా ఎగురవేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతిని పురస్కరించుకొని కుసంగి గ్రామం పంచాయతీ వద్ద గౌడ సంఘం మరియు గ్రామ పెద్దలు, కుల పెద్దల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వయీ పాపన్న గౌడ్ 375 వ జయంతి



**హైదరాబాద్ పెన్ పవర్:** వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వయీ పాపన్న గౌడ్ 375వ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సర్దార్ పాపన్న గారి పోరాటాలు, త్యాగాలు వెనకబడిన వర్గాల గౌరవాన్ని కాపాడటమే కాకుండా సామాజిక సమానత్వానికి మార్గదర్శకమయ్యాయని అన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకలుగా జరపడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గం శాసన సభ్యులు చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మాల్ మార్కెట్లో ముత్యాలమ్మ పోతురాజుల విగ్రహ ప్రతిష్ట



**హైదరాబాద్ పెన్ పవర్:** యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్లో బేడ బుడిగ జంగాల కాలనీలో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ , పోతురాజు మూల విగ్రహ స్థిర యంత్ర ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో మరియు హోమంలో కాలనీవాసులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ జహంగీర్ యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి భాస్కర్ గౌడ్ యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సపావట్ కిషన్ మాజీ వార్డు సభ్యులు దేరంగుల కృష్ణ, కడమంచి యాదమ్మ జంగయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి మురళి బేడ బుడిగ జంగాల అధ్యక్షులు కడమంచి రాజు ఉఫాధ్యక్షులు ఆనరాశి రాజు ప్రధాన కార్యదర్శి ఆనరాశి శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీ ఆన రాశి మురళి కోశాధికారి కడమంచి శివ మిరియాల రమేష్ ఆనరాశి రాజు ఇప్ప అంజి మోతె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుర్మిద్ద గ్రామ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శిగా మడ్డి సురేష్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య ఆధ్వర్యంలో ఎన్నిక



**హైదరాబాద్ పెన్ పవర్:** యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద సిపిఎం పార్టీ శాఖ సమావేశం జరిగింది గతంలో వున్నా శాఖ కార్యదర్శి పి పౌలు అనారోగ్య కారణాల వల్ల కార్యదర్శిగా తగ్గించి యువ నాయకుడు లిమడ్డి సురేష్ ని సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగింది అనంతరం మడ్డి సురేష్ మాట్లాడుతూ సిపిఎం పార్టీ ప్రజా లను నిరంతరం చైతన్యం చేస్తూ ప్రజా సమస్యల పై అలుపెరుగనిపోరాటం చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడు నై గతంలో సిపిఎం పార్టీలో చేరినాను అనతి కాలంలో నన్ను పార్టీ కార్యదర్శిని చేసినందుకు నాయకులకు పార్టీ సభ్యులకు ధన్యవదాలు తెలుపుతూ పార్టీ నామీద నమ్మకంతో పెట్టిన భాధ్యతను నమ్మకం తో విశ్వాసంతో పనిచేస్తానని తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి మేఘన్న చేయూత



**హైదరాబాద్ పెన్ పవర్:** పెబ్బేరు మండల పరిధిలోని బూడిదపాడు గ్రామానికి చెందిన గూడెం గోవిందమ్మ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. ఈ విషయాన్ని బూడిదపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోగా మేఘన్న చేయూత సహాయం ద్వారా మృతురాలి కుటుంబానికి రూ,5000 వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి, తిరుపతయ్య, మండ్ల ఆంజనేయులు, మండ్ల శంకర్ చేతుల మీదగా అందజేశారు.

## తొలి తెలుగు తేజం గౌడ జాతి ముద్దుబిడ్డ సర్దార్

# సర్వాయి పాపన్న 375 వ జయంతి





**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం అధ్యక్షుడు నర్సన్ గౌడ్ ఆధ్వర్యంలో బహుజన వీరుడు గౌడ జాతి ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతిని శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాయందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ బహుజన ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న 300 సంవత్సరాల క్రితమే 12,000 మందిగా సైన్యాన్ని తయారు చేసుకొని రజాకర్లపై యల్మాలపై తిరగబడి పోరాటం చేసి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఈ సందర్భంగా బహుజన రమేష్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినటువంటి వారిని మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఇలాంటి కార్యక్రమాలను మన ముందు ప్రతి గ్రామంలో నిర్వహించి వారిని ఆదర్శంగా తీసుకొని వారి యొక్క విగ్రహాలను కూడా ఏర్పాటు చేసుకుంటే వారి యొక్క చరిత్ర అందరికీ తెలిసే విధంగా చేయవలసిన బాధ్యత అందరిపై ఉండాలని బహుజన్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సన్ గౌడ్ , మాజీ సర్పంచ్ ఆర్ వెంకటస్వామి, బహుజన్ రమేష్,నీరుగంటి వెంకటేష్ గౌడ్ మధుమోహన్ గౌడ్, మేఘనాథ్ గౌడ్,రాజు గౌడ్, పి.వెంకటేశ్వరగౌడ్, ఆశన్న, ఎల్లా గౌడ్, ప్రభాకర్ గౌడ్, రాజా గౌడ్,బాలరాజు గౌడ్,రమేష్ గౌడ్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

## ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్యస్థాపన చేసిన సర్వాయి పాపన్నగౌడ్...



**హైదరాబాద్ పెన్ పవర్:** ట్యాంక్ బండ్ పై రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండటం హర్షనీయమని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ గౌడ కులవృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని తెలిపారు. కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్న గౌడ్ పోరాటం గొప్ప విషయమని అన్నారు. ఆధిపత్యాన్ని ఎదిరించి బహుజన రాజ్యస్థాపన చేసిన సర్వాయి పాపన్న గౌడ్ అందరికీ ఆదర్శనీయుడని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా బీసీ విద్యార్థులకు విద్యలో నైపుణ్యం కోసం ప్రత్యేకంగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ ఓ సంగీత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశూరాం, బీసీ ఫ్రంట్ నాయకుడు, మల్లేష్ యాదవ్, సుధాకర్ గౌడ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# 24 న వరంగల్ లో బహిరంగ సభ,ప్రదర్శన

- ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో
- కాల్పుల విరమణ ప్రకటించి, శాంతి చర్చలు జరపాలని జవహర్ నగర్ లోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నేతల డిమాండ్.
- కార్పొరేట్ ప్రయోజనాలకోసమే కగార్ పేరుతో ఆదివాసీల నిర్మూలన, మావోయిస్టుల ఏరివేత అని స్పష్టం చేసిన నేతలు
- పీఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత అధ్యక్షతన జరిగిన పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్య భారతదేశంలోని దండకారణ్యంలో మావోయిస్టు ఏరివేత పేరిట జరుగుతున్న ఆదివాసి నిర్మూలనను మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు, మిలటరీ బలగాలు కగార్ పేరుతో జరుపుతున్న హత్యాకాండను వెంటనే ఆపాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, మాస్ లైన్, న్యూడెమోక్రసీ, బీఎస్పీ పార్టీలతోపాటు ప్రజాసంఘాలకు చెందిన నేతలు సోమవారం రోజు డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత అధ్యక్షతన 2025, ఆగస్టు-18, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండల్ జవహర్ నగర్ లోని బాబు జగ్జీవన్ రావు, అంబేద్కర్ విగ్రహాల ముందు పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈనెల 24 న వరంగల్ లోని అంబేద్కర్ భవనంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆదివాసీ హక్కులు, కార్పొరేటీకరణ,కగార్ హత్యాకాండ, కాల్పుల విరమణ అనే అంశాలపై జరిగే బహిరంగ సభకు తరలి రావాలని టిజేఎస్ బి.అంజినేయులు, సిపిఎం శివన్నారాయణ, బీఎస్పీ బిర్రు యాకస్వామి, సిఎంఎస్ జయ, ఏ.ఐ.ఎఫ్.టి.యు. మల్లేష్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ స్వరూప, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి ఎం.డి.పాషామియా, క్రాంతి కళాబృందం వెంకటాచారి, టిపిఎఫ్ రాంబాబు, పిడిఎం రవి, పికెఎం జాన్, ఎమ్మార్పీఎస్ శివ, బీసి సంఘం వడ్డెర నర్సన్న పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ, అమిత్ షా ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగ, చట్టబద్ధమైన ప్రజాస్వామ్య పరిపాలన ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా బీజేపీ మోడీ, షాలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 7 లక్షల కోట్ల విలువైన 28 రకాల అటవి ఖనిజ సంపదలను బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబట్టెందుకు జరుగుతున్న కుట్రకు ఆదివాసి గిరిజన ప్రజలు అడ్డుగా ఉన్నారని, అందుకే వారి హక్కులను కాలరాచి,వారి అవాసాల నుండి బలవంతంగా తరిమేస్తున్నారని గుర్తుచేశారు. ఈ కుట్రకు వ్యతిరేకంగా అటవి హక్కుల పరిరక్షణకు, ఆదివాసుల మనుగడ కొరకు పోరాడుతున్న మావోయిస్టులను, ఆదివాసులను చంపడమే లక్ష్యంగా చేసుకొని జరుపుతున్న మారణహోమం పట్ల వివిధ వర్గాల ప్రజా సమూహాలలో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చల డిమాండ్ ను గుర్తించాలని కోరారు. కాల్పుల విరమణ ప్రకటించి, ఆపరేషన్ కగార్ ను ఎత్తివేయాలని 24 న జరుగుతున్న వరంగల్ సభను, ఆతర్వాత జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 600 పైగా ఎన్ కౌంటర్ల పేరుతో మావోలు కంటే ఆదివాసులే ఎక్కువగా మరణించారని పేర్కొన్నారు. వీటిపై సుప్రీం కోర్టు జడ్జీచేత న్యాయ విచారణ చేపట్టి, బాధ్యులైన పోలీసు, మిలటరీ అదికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సజీవంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ షేక్ షావలి, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, వికలాంగుల సంఘాల నాయకులు మోనార్క్ దుర్గాప్రసాద్, మబ్బుబాలు, ముస్లిం కమిటీ టి.కాలేషా, మోఇన్, గౌస్, సైయద్, ముబషీర్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి..

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..

ప్రజావాణికి ( 70) ఫిర్యాదులు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (70) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ - 39, మున్సిపల్ శాఖ - 6, ఎడ్యుకేషన్ - 9, ఇంటర్మీడియట్ బోర్డు - 6, సివిల్ కోర్టు - 1, పోలీసు శాఖ - 2, డీఆర్ డిఓ (పెన్షన్)- 2, ఎంపిడివో - 1, పంచాయతీ రాజ్ - 2, హౌసింగ్- 1, వ్యవసాయ శాఖ - 1 దరఖాస్తులు అందాయి. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో యూరియా వాడకంపై కెమికల్స్ తగ్గించే విధంగా రైతులకు అవగాహన సదస్సును ఆదర్శరైతులు, డీపీఓలు గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేయాలని అన్నారు. ఫర్టిలైజర్ వాడకంలో కెమికల్స్ ఎక్కువగా ఉంటాయని వాటిని వాడితే కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా వన మహోత్సవంలో ఆయా శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఆయా స్థాయిలోని ఇండ్లకు పేమెంట్స్ త్వరితగతిన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముంపుకు గురైన ప్రత్తిపంట ను పరిశీలించిన వ్యవసాయ అధికారులు..

- నీటి ముంపుకు గురైనప్పుడు పంటచేలలో ఉన్న నీటిని తీసివేయాలి..
- వేరుకుళ్ళు తెగులు నివారణకు పొలంలో నీరు తీసిన తర్వాత.
- మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ 1 లీటర్ నీటి కలిపి..వేరు తడిచేలా పోయాలి,
- వ్యవసాయ సహాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి.
- మండల వ్యవసాయ అధికారి మదనపల్లి శివశంకర్.



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో తీవ్ర వర్షాభావం తో ముంపుకు గురైన ప్రత్తి పొలాలను ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి, ఎమ్మిగనూరు మండల వ్యవసాయ అధికారి మదనపల్లి శివశంకర్ లు సోమవారం రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు ముఖ్య సూచనలు చేశారు. ఇందులో భాగంగా

1). ప్రతి పంట ముంపుకు గురైనప్పుడు పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబాడటం పడిపోవడం జరుగుతుందని, నీటి ముంపుకు గురైనప్పుడు పంటచేలలో ఉన్న నీటిని తీసివేయడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా 19 గ్రాములు యూరియా లీటర్ నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేసుకోవాలని, తర్వాత ఎకరాకు 30 కిలోల యూరియా 20 కిలోల పొటాషియం పైపాటగా వేసుకోవాలి తర్వాత అంతర సేద్యం చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల పొలం త్వరగా ఆరడంతో పాటు వేరు వ్యవస్థకు ఆక్సిజన్ లభ్యం అవుతుంది ఇటువంటి వాతావరణం పరిస్థితుల్లో వేరుకుళ్ళు తెగులు కాయ కుళ్ళు తెగులు ఎక్కువగా ఆశించి పంటలకు నష్టాన్ని కలగజేస్తాయని తెలిపారు. కనుక వేరుకుళ్ళు తెగులు నివారణకు పొలంలో నీరు తీసిన తర్వాత మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ 1 లీటర్ నీటి కలిపి తెగులు సోకిన పాదుల చుట్టూ వేరు తడిచేలా పోయాలి, కాయ కుళ్ళు తెగులు నివారణకు ఒక లీటర్ నీటికి 100 గ్రాముల. స్టెప్టోసైక్లిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ కలిపి 2 నుంచి 3 సార్లు పిచికారి చేసుకోవాలన్నారు.

2). మిరపలో అధికంగా నీరు ఉన్న పొలాలలో 10 గ్రాముల 19:19:19 లీటర్ నీటికి కలుపుకొని, పొటాషియం నైట్రైట్ 10 గ్రాముల లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలి. నారు కుళ్ళు మొదలు తెగులుకు కార్బన్డిజం 1 గ్రాము లేదా మ్యాంగోజబ్ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటి కలిపి మొదలుతడిచేలాగా పిచికారి చేయాలన్నారు.

3). వేరుశనగ.-కోతకు సిద్ధంగా వేరుశనగ పంటను వర్షాలకు ముందు పీకరాదు. పీకన పూర్తిగా

ఆరిన పంటలను తుఫాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు చెట్లపై టార్పాలిన్ కప్పి కుప్పలు వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు, కాయలు రంగు మారి తడిచినట్లయితే పచ్చి కాయలుగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని తెలిపారు.

4). పొలం గట్ల చుట్టూ వయ్యారిభామ/కాంగ్రెస్ గడ్డిని లేకుండా చూసుకోవాలి దీనివల్ల పంటలకు వైరస్ వ్యాప్తి చెందుతుంది విధిగా అందరూ తప్పకుండా పొలం చుట్టూ వయ్యారి భామను/కాంగ్రెస్ గడ్డలు లేకుండా చూసుకుంటే చాలా వరకు వైరస్ ను తగ్గించుకోవచ్చని తెలిపారు.

# 1500 గజాల స్థలాన్ని కాజేశారు.. కరాటే కళ్యాణి ఆరోపణలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** సినిమా ఇండస్ట్రీలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కరాటే కళ్యాణి.. సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్ గా ఉంటుంది. అంతేకాదు బయట ఏవైనా సమస్యలు ఉంటే వాటి మీద స్పందించడానికి కూడా కరాటే కళ్యాణి ముందుంటుంది. అయితే అలాంటి కరాటే కళ్యాణి తాజాగా ఒక సంచలన విషయాన్ని బయట పెట్టింది. బంజారా హిల్స్ లో ఉండే కోట్ల విలువ చేసే 1500 గజాల స్థలాన్ని ఓ మేయర్ కాజేసింది అంటూ సంచలన ఆరోపణలు చేస్తోంది..మరి ఇంతకీ ఈ 1500 గజాల స్థలం కాజేయడం ఏంటి..? దాని వెనుక ఉన్న అసలు నిజం ఏంటి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.తాజాగా కరాటే కళ్యాణి తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సంచలన వీడియో పోస్ట్ చేసింది. అది కూడా తన చేతిలో ప్రూఫ్ పేపర్లు పట్టుకొని మరీ అన్ని విషయాలు బయట పెట్టింది. ఇందులో భాగంగా బంజారాహిల్స్ లో ఉండే కోట్ల విలువ చేసే 1500 గజాల స్థలాన్ని మేయర్ గద్వాల విజయలక్ష్మి కాజేసిందంటూ ఆరోపించింది. కరాటే కళ్యాణి మాట్లాడుతూ... 2023లో ఈ స్థలాన్ని మేయర్ విజయలక్ష్మికి రెగ్యులరైజ్ చేశారు..అది కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతోనే జరిగింది. మేము పెద్దమ్మ గుడి కోసం స్థలాన్ని ఇవ్వమంటే గజానికి 2 లక్షలు చెప్పారు. అలాంటిది గజానికి 350 చొప్పున మేయర్ విజయలక్ష్మి పేరిట ఆ స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు?మేయర్ విజయలక్ష్మికి సంబంధించిన అక్రమాలు ఇప్పటికే జర్నలిస్టు మిత్రులు ఎన్నో బయటకు తీసి రాశారు. కానీ ఇప్పటివరకు ఆమెపై యాక్షన్ తీసుకున్నదే లేదు. అలాగే ఆ మేయర్ అంత పేద బ్రతుకు బ్రతుకుతోందా..? పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని, ఆమె చాలా సంవత్సరాల నుండి అక్కడే నివాసం ఏర్పర్చుకుందని 350 రూపాయల చొప్పున 1500 గజాలని రిజిస్ట్రేషన్ చేశారా..? అయితే పెద్దమ్మ గుడి కూడా అక్కడ దాదాపు 70,80 సంవత్సరాలు నుండి ఉంటుంది. అలాంటిది పెద్దమ్మ గుడికి స్థలాన్ని ఎందుకు కేటాయించరు.. ఆ పేద కుటుంబానికి చెందిన మేయర్ విజయలక్ష్మికి ఎలా కేటాయిస్తారు.. ఇదంతా బీఆర్ఎస్ హయాంలోనే జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ అండదండలు చూసుకుని రిజిస్ట్రేషన్ చేశారు. పెద్దమ్మ గుడికి స్థలాన్ని కేటాయించమంటే మా మీద రాళ్లు రువ్వుతారు. ఇంట్లో నుండి రానివ్వకుండా హౌస్ అరెస్టు చేస్తారు. మరి ఆమెకి ఎలా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు..
తక్షణమే ఈ విషయం గురించి రేవంత్ రెడ్డి విచారణ జరిపించాలి. 1000 గజాల స్థలాన్ని పెద్దమ్మ గుడికి ఇవ్వమంటే ఇవ్వలేదు. కానీ 2023లో మేయర్ విజయలక్ష్మి తన పేరు మీద ఆ స్థలాన్ని రెగ్యులరైజ్ చేసుకుంది" అంటూ ఆధారాలతో సహా బయటపెట్టింది. అంతేకాదు ఏ అర్హత ఉందని గద్వాల్ విజయలక్ష్మికి 1500 గజాల స్థలాన్ని కేటాయిస్తారు. ఆమె ఏమైనా ఫ్రీడమ్ ఫైటరా.. లేక ఆమె తండ్రి ఏమైనా ఫ్రీడమ్ ఫైటరా.. లేక ఆమె తాత ఏమైనా ఫ్రీడమ్ ఫైటరా..ధ
ఏ ఉద్దేశంతో ఆమెకు స్థలాన్ని కేటాయించారు అంటూ మేయర్ గద్వాల విజయలక్ష్మి చేసిన భూ దందాని బయటపెట్టింది నటి,హిందూ సంఘ నేత అయినటువంటి కరాటే కళ్యాణి.. ప్రస్తుతం కరాటే కళ్యాణి ఆధారాలతో సహా ఈ భూ దందా ఇష్యూ ని బయటికి తీయడంతో ఈ విషయం కాస్త మీడియాలో వైరల్ గా మారింది.మరి కరాటే కళ్యాణి చేసిన ఆరోపణలపై మేయర్ ఏ విధంగా క్లారిటీ ఇస్తుంది.? ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది ?అనేది చూడాలి.

# మహిళా ఫ్రీ బస్ సక్సెస్ కాలేదా ?




**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలకు ఉచిత బస్సు పథకం. ఈ ఆకర్షణీయమైన పథకాన్ని మొదట ప్రారంభించింది కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం. 2023 మేలో జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీని వారు ఇవ్వడం జరిగింది. ఇక అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా అమలు చేశారు. తెలంగాణాలో కూడా అదే ఏడాది చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అని చెప్పారు. ప్రచారం ధాటీగా చేశారు. అధికారంలోకి కాంగ్రెస్ వచ్చింది. వెంటనే అమలు చేశారు.

**ఏపీలోనూ అదే హామీ :**

కట్ చేస్తే ఏపీలో కూడా అదే పథకాన్ని అమలు చేస్తామని టీడీపీ కూటమి 2024 ఎన్నికల వేల భారీ హామీ ఇచ్చింది ఇక అధికారంలోకి వచ్చాక దాదాపుగా పద్నాలుగు నెలలకు పైగా సమయం తీసుకుని ఎట్టకేలకు ఈ ఆగస్టు 15న ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కర్ణాటక తెలంగాణాల్లో ఈ పథకాన్ని మొత్తం అన్ని సర్వీసులకు అమలు చేస్తూంటే ఏపీలో అయిదు సర్వీసులకే పరిమితం చేశారు. మరి అన్ని సర్వీసులకూ ఇచ్చి రాష్ట్రమంతా ఫ్రీ బస్సు అని వారికి ఎంతో మేలు చేసిన ఈ పథకం నిజంగా అక్కడ సక్సెస్ అయిందా అన్నదే ఇపుడు చర్చ.

**పొలిటికల్ మైలేజ్ రాలేదా :**

ఇక చూస్తే తెలంగాణా కర్ణాటకలో ఈ పథకం ఏ కండిషన్లూ లేకుండా అమలు చేశారు. పైగా అధికారంలోకి వస్తూనే చేశారు. మరి అక్కడ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలకు రాజకీయంగా ఈ పథకం వల్ల మేలు జరిగిందా అంటే లేదు అనే జవాబు వస్తోంది. అదెలా అంటే 2023లో కర్ణాటక తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిచిన కాంగ్రెస్ 2024 మేలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆ రెండు రాష్ట్రాలలోనూ పెద్దగా సీట్లు గెలవలేదు తెలంగాణాలో ఎనిమిది ఎంపీ సీట్లు మాత్రమే గెలిస్తే కర్ణాటకలో మూడు ఎంపీలే గెలిచింది. అంటే మహిళా లోకానికి ఎంతో చేశామని చెప్పుకున్నా రాష్ట్రమంతా ఫ్రీగా బస్సులలో తిప్పినా కూడా ఈ పథకం ఓట్లు రాల్చలేదు అన్నది అర్థం అవుతోంది కదా అంటున్నారు విశ్లేషకులు.

**ఆ కాడికి నష్టమే కదా :**

ఇక మహిళలకు ఉచిత బస్సుల వల్ల ప్రయోజనం సంగతి పక్కన పెడితే ఆటో కార్మికులు ఆగ్రహం చెంది కాంగ్రెస్ కి దూరం అయ్యారని కూడా ఫలితాలు చెబుతున్నాయి. అంతే కాదు ఈ పథకం అమలుతో మగవారు కూడా తమకు బస్సులలో సీట్లు లేవని తాము ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహించారు. సమాజంలో ఒక వర్గాన్ని ఎత్తి మరో వర్గాన్ని పక్కన పెడితే వచ్చే పర్యవసానాలు ఈ పథకం వల్ల ఆ రెండు ప్రభుత్వాలూ చూశాయి అంతే కాదు ఖజానాకి పెద్ద చిల్లు పడింది. చేయాల్సిన ఇతర కార్యక్రమాలు ఆగుతున్నాయి. దీంతో ఆ వర్గాలలో అసహనం పెరుగుతోంది అన్నది మరో విశ్లేషణ.


**జాబ్స్ ఇవ్వాలి కానీ :**

ఊరకే బస్సులలో మహిళలకు తిప్పితే ఏమి లాభం జాబ్స్ ఇవ్వాలి కానీ అని తెలంగాణా బీజేపీకి చెందిన మహిళా నాయకురాలు మాధవీలత ఇప్పటికే తెలంగాణా కాంగ్రెస్ మీద ఫ్రీ బస్ విషయంలో ఘాటు విమర్శలు చేశారు. అవి ఏపీకీ వర్తిస్తున్నాయని అంటున్నారు. ఏకంగా రెండు వేల కోట్లు ఖజానాకు చిల్లు పెట్టుకుని ఉచిత బస్సు అని ఊదరగొట్టినా దాని వల్ల ఒరిగేది ఏముంటుంది అన్నది కూడా నిర్వేదం నుంచి వస్తోంది.

**కొత్త పథకం అయితే మోజు :**

ఇక దాదాపుగా రెండున్నర ఏళ్ళ నాటి పాత పథకం ఇది. దీనిని అమలు చేయడం ఆ రాష్ట్రాల విషయంలో కొత్త ఏమో కానీ ఏపీ దాకా వచ్చేసరికి పాతబడిపోయింది, ఆ మోజు కూడా తీరింది అని అంటున్నారు. పైగా పేటెంట్ హక్కులు అయితే పూర్తిగా కాంగ్రెస్ వి. దాంతో టీడీపీ పొలిటికల్ గా పెద్దగా క్లెయిం చేసుకునే వీలు ఉండదని అంటున్న వారూ ఉన్నారు. ఇలా వేల కోట్ల రూపాయలు ఈ ఉచిత పథకానికి వెచ్చించే బదులు కొత్త బస్సులు కొని విరివిగా అవసరం ఉన్న ప్రాంతాలలో నడిపితే గమ్యానికి వేగంగా సేఫ్ గా ఆర్టీసీ బస్సులలో తాము చేరుతున్నామన్న ఆనందం మొత్తం స్త్రీ పురుషులు అన్న తేడా లేకుండా అందరిలో ఉంటుంది కదా అని అంటున్నారు. మొత్తం మీద ఫ్రీ బస్ అయితే పెద్దగా పొలిటికల్ మైలేజ్ ఇచ్చేది లేదు అన్నది రూఢీ అయిన విషయం అంటున్నారు.


# చర్చనీయాంశంగా ఏపీ మంత్రి కుమార్తె నిశ్చితార్థం.. స్పెషల్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని ఎస్-కన్వెన్షన్ సెంటర్ లో మంత్రి నిమ్మల రామానాయుడి కుమార్తె శ్రీజ నిశ్చితార్థ వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకకు మంత్రి లోకేష్ తోపాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ హాజరయ్యారు. కాబోయే వధూవరులు శ్రీజ, పవన్ ను అక్షతలు వేసి ఆశీర్వదించారు. వీరితో పాటు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, శాసనమండలి ఛైర్మన్ మోషెన్ రాజు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖులు హాజరయ్యారు. ఆ సంగతి అలా ఉంటే ఈ రోజుల్లో వివాహ కార్యక్రమాల విషయంలో చాలా మంది అనుసరించే ఆర్భాటాల వైఖరికి భిన్నంగా జరిగిన ఈ కార్యక్రమం చర్చనీయాంశంగా మారింది.అవును... ఈ రోజుల్లో ఓ మోస్తరు వ్యక్తుల ఇళ్లల్లోని వివాహ కార్యక్రమాలు ఎంతో భారీ ఎత్తున జరుగుతున్న ఘటనలు కనిపిస్తున్న సంగతి తెలిసిందే. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, దుమ్ము లేపేస్తున్నారు. అలాంటిది రెండుసార్లు ఎమ్మెల్యే, ప్రస్తుతం నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేస్తున్నారు. అలాంటి సీనియర్ నాయకుడి ఇంట్లో కార్యక్రమం అత్యంత సింపుల్ గా జరిగింది!
ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే... తన కుమార్తె నిశ్చితార్థ వేడుకలో మంత్రి రామానాయుడు ధరించిన దుస్తులు. ధ
సాధారణంగా ఇంట్లో జరిగే ఇలాంటి వేడుకల్లో కాస్త బరువైన, ఘనమైన దుస్తులనే ఎక్కువమంది ప్రిఫర్ చేస్తారనే సంగతి తెలిసిందే. కానీ రామానాయుడు మాత్రం తన ట్రేడ్ మార్క్ పసుపు చొక్కా ధరించి కనిపించారు. ఇది కూడా చర్చనీయాంశంగా మారింది.మరోవైపు జిల్లా పర్యటనకు వచ్చిన లోకేష్ కు నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, శ్రేణులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలోనూ పసుపు చొక్కా ధరించిన రామానాయుడిని, నారా లోకేష్ ఆటపట్టించారని తెలుస్తోంది.

# చంద్రబాబు సర్కారు అదిరి పోయే ప్లాన్.. వైసీపీ ఇప్పుడేం చేస్తుందో?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'స్త్రీశక్తి' ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకంపై అధికార, విపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం సూపర్ హిట్ అయిందని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అంతేకాకుండా ప్రజల్లో అనూహ్య స్పందన కనిపిస్తోందని, ఆగస్టు 15న ఈ పథకం ప్రారంభించగా, నాలుగు రోజులుగా లక్షల మంది మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించారని గణాంకాలు చూపుతోంది. అయితే ఉచిత బస్సుపై పరిమితులు పెట్టారని, ప్రజలను మోసం చేశారని వైసీపీ విమర్శలకు దిగుతోంది. దీనిపై తన సోషల్ మీడియా టీంతో వీడియోలు చేయిస్తూ తమ పార్టీ వాదనను ప్రజల్లోకి తీసుకువెళుతోంది.వైసీపీ విమర్శలకు ప్రభుత్వం కూడా దీటుగా కౌంటర్ అటాక్ చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని టార్గెట్ చేస్తూ ఉచిత బస్సుతో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లవచ్చని చెప్పటమే కాకుండా, వైసీపీ అధినేత జగన్ ఉచిత బస్సు పథకం ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు తన సతీమణి భారతీరెడ్డిని తీసుకని వారి సొంత నియోజకవర్గం పులివెందుల నుంచి తిరుపతి వరకు వెళ్లవచ్చని చెబుతోంది. అయితే టీడీపీ ఈ స్థాయిలో ఎదురుదాడి చేస్తున్నా వైసీపీ తన విమర్శలను మాత్రం ఆపడం లేదు. ఉచిత బస్సు పథకం అన్ని బస్సు సర్వీసుల్లోనూ అమలు చేయాలని గట్టిగా డిమాండు చేస్తోంది. రాష్ట్రంలో 11 రకాల బస్సు సర్వీసులు ఉంటే, కేవలం 5 రకాల సర్వీసులకు ఉచిత పథకాన్ని వర్తించేలా అమలు చేయడాన్ని వైసీపీ ఆక్షేపిస్తోంది.నాలుగు రోజులుగా రాష్ట్రంలో లక్షల మంది మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్న ఉచిత బస్సు పథకంపై వైసీపీ విమర్శల దాడి ఆపకపోవడాన్ని సీరియస్ గా తీసుకున్న టీడీపీ అదిరిపోయే ప్లాన్ వేసింది. జగన్మోహనరెడ్డి పార్టీకి ఆయన సొంత ప్రాంతం నుంచే సమాధానం చెప్పాలని నిర్ణయించింది. దీంతో ప్రతిరోజూ మహిళా ప్రయాణికులపై డిపోల వారీగా సమాచారం తెప్పించుకుంటున్న ప్రభుత్వం.. పులివెందుల నియోజకవర్గంలో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు, ఆ నియోజకవర్గం పరిధిలోని మండలాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతున్న బస్సు ప్రయాణికుల వివరాలను సేకరించింది. దీనిద్వారా జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో కూడా ప్రభుత్వ పథకానికి ఆదరణ లభిస్తోందని చెప్పాలని ప్రభుత్వం వ్యూహం రచించింది.ఇక పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్ లెక్కల ప్రకారం గత మూడురోజుల్లో సుమారు 20 వేల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అంటే పులివెందుల అసెంబ్లీ సెగ్మంటులో కూడా ఉచిత బస్సు పథకానికి మంచి ఆదరణ లభిస్తోందన్న విషయాన్ని ప్రభుత్వం వెల్లడించింది. అంతేకాకుండా పులివెందుల డిపో పరిధిలో సుమారు రూ.7.5 లక్షల డబ్బు మహిళలకు ఆదా అయిందని కూడా అధికారులు చెబుతున్నారు. దీంతో వైసీపీ చేస్తున్న విమర్శలకు క్షేత్రస్థాయిలో పథకం అమలు తీరుకు ఎక్కడా సంబంధం లేదని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. 80 శాతం ప్రయాణికులకు మేలు జరుగుతోందని ఉచిత పథకం ద్వారా మహిళలు చాలా ఆనందంగా ఉన్నారని ప్రభుత్వం వివరిస్తోంది.మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గంలోని మహిళల అంతరంగం తెలుసుకోకుండా, తన పార్టీ నేతలతో 'స్త్రీశక్తి' పథకంపై విమర్శలు చేయిస్తున్నారని ప్రభుత్వం మండిపడుతోంది. మరోవైపు ఉచిత బస్సు పథకానికి ప్రజల నుంచి స్పందన బాగుండటంతో ప్రభుత్వానికి పాజిటివ్ టాక్ వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో వైసీపీ విమర్శలపైనా సమీక్షించిన ప్రభుత్వం.. ఘాట్ రోడ్డులలో బస్సులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయాలని నిర్ణయించింది.

# అమరావతి వరద నీటి మీద అధికార ప్రకటన చేయొచ్చుగా !

**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి ఏపీకి రాజధాని. ఏకైక రాజధానిగా ఉండాలని 2024 ఎన్నికల్లో జనాలు భారీ ఎత్తున ఓట్లెత్తారు. అమరావతిని ప్రపంచ రాజధాని చేయాలని తెలుగుదేశం పార్టీ కలలు కంటోంది. దాని కోసం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే కసరత్తు చేస్తోంది. ఇక ఆర్థిక వనరుల ఇబ్బందులు కూడా క్రమంగా తొలగిపోతున్నాయి. ప్రపంచ బ్యాంకు ఆసియా బ్యాంక్ సహా అనేక బ్యాంకులు ముందుకు వచ్చి రుణాలు ఇస్తున్నాయి. పైపెచ్చు కేంద్ర సహకారం కూడా అండగా ఉంది ఇంతటి మంచి సానుకూల వాతావరణంలో నల్లేరు మీద బండిలా నడవాల్సిన అమరావతి రాజధాని వ్యవహారం మీద ఎందుకో ఏదో రూపంలో వార్తలు రావడం వివాదాలు రేగడం అంతా చూస్తూనే ఉన్నారు.

**వీడియోలతో అయోమయం :**

తాజాగా చూస్తే భారీ వర్షాలతో కోస్తా ఉక్కిరిబిక్కిరి అవ్వింది. ఈ సమయంలో అమరావతి రాజధాని అంతా వరద నీటితో ఉప్పొంగుతోందని, నీటి వల్ల రాజధాని మునిగిపోతున్నాయని కూడా విపరీతమైన ప్రచారం చేస్తున్నారు. వరదనీటిలో అమరావతి అని వీడియో పోస్టులు పెడుతూ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. అయితే అమరావతి విషయంలో ఏమి జరుగుతోంది అన్నది మాత్రం జనాలకు పూర్తి విషయం తెలియక అయోమయానికి గురి అవుతున్నారు. అంతే కాదు అసలు విషయం పక్కా క్లారిటీగా తెలిస్తే బాగుంటుందని ఎదురు చూసేవారూ ఉన్నారు.

**ప్రభుత్వం స్పష్టత ఇవ్వొచ్చుగా :**

అమరావతి రాజధాని అన్నది ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మరి చినుకు పడితే చిత్తడి అవుతోందని వార్తలు తరచూ వస్తున్నాయి. రాజధాని నీట మునిగింది అని కూడా వైరల్ చేస్తున్నారు. దీంతో అసలు విషయం ప్రభుత్వమే అధికారిక ప్రకటన ద్వారా తెలియచేస్తే బాగుంటుంది కదా అని అంతా అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే అమరావతి మీద చాలా మంది వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. దాంతో నిజమేంటి అబద్ధం ఏమిటి అన్నది జనాలకు అసలు అర్థం కావడం లేదు అని అంటున్నారు అందుకే ఈ విషయంలో ప్రభుత్వమే ముందుకు వచ్చి ఒక స్పష్టత ఇవ్వవచ్చు కదా అని అంతా అభిప్రాయపడుతున్నారు.

**టీడీపీ సైలెంట్ ఎందుకు :**

ఇక ప్రతీ ఇష్యూలో చూస్తే టీడీపీ సోషల్ మీడియా ఫుల్ చార్జితో ఉంటుంది. వైసీపీ ఒక పోస్టు పెడితే టీడీపీ నుంచి పది పోస్టులు వస్తాయి. ఒక వైపు వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు అమరావతి నిండా మునిగింది అని పోస్టుల మీద పోస్టులు పెడుతూంటే టీడీపీ నుంచి కనీసం ఖండించడం కూడా లేకపోవడం పట్ల చర్చ అయితే హాట్ హాట్ గా సాగుతోంది. దాంతో వైసీపీకే ఈ విషయంలో మంచి మైలేజ్ దక్కుతోంది అని అంటున్నారు.

**అవి ఓల్డ్ నా లేక :**


అయితే అమరావతి మునిగింది అంటూ వైసీపీ అభిమానులు కానీ సోషల్ మీడియా యాక్టివిస్టులు కానీ చేస్తున్న వీడియోలు పెడుతున్న పోస్టింగులు ఓల్డ్ వా లేక ఫేక్ వీడియోస్ నా అన్న చర్చ కూడా సాగుతోంది. పాతవి అయితే టీడీపీ ఈ పాటికే ఖండించి ఉండాల్సింది కదా అని అంటున్నారు. ఈ విషయంలో పార్టీ పరంగా టీడీపీ ఏమి చెప్పినా చెప్పకపోయినా ప్రభుత్వం అయితే క్లారిటీ జనాలకు ఇవ్వాల్సి ఉంటుంది అని అంటున్నారు. మొత్తం మీద భారీ వర్షాలు తుఫాన్లు వచ్చినపుడు గతమెలా ఉన్నా ఇపుడు సోషల్ మీడియాలో మాత్రం అమరావతి రాజధాని హైలెట్ అవుతోంది. ఇలాంటి సమయాల్లో జనాలకు వాస్తవాలు ప్రభుత్వం చెబితే రానున్న రోజులలో అయినా విషయం ఇదీ అని ప్రజలకు అర్థం అవుతుంది అని అంటున్నారు. లేకపోతే ఈ వీడియోలనే నమ్మేస్తారు అని కూడా అంటున్నారు.

# విశాఖ ఉక్కు.. మరింత చిక్కు.. తాజా డెసిషన్ ..!




**హైదరాబాద్  పెన్ పవర్:** విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో మరో పెద్ద చిక్కు తెరమీదికి వచ్చింది. ఈ ప్లాంటును ప్రైవేటీకరించ వద్దని.. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మూడేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నాయి. అయితే.. వీరు ఆశిస్తున్నట్టుగా క్షేత్రస్థాయిలో ఏమీ జరగడం లేదు. పైగా.. ఎప్పటికప్పుడు.. ప్రైవేటీకరణ అంశం తెరమీదకి వస్తూనే ఉంది. దీనిని ప్రైవేటీకరించకుండా.. తాము అడ్డు పడతామని కూటమి నాయకులు, మంత్రి నారాలోకేష్ ప్రకటించారు.కానీ, వారు చెబుతున్న మాటలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంటుకు సంబంధించి ఏకంగా 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు.. కేంద్ర ఉక్కు మంత్రి త్వ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో విశాఖ ఉక్కు అధికారులు వీటికి సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చేశారు. అంటే.. తాంబూలాలిచ్చేశాం.. అన్నట్టుగా వ్యవహరించారు. వీటిలో కీలకమైన గనులు కూడా ఉన్నాయి. వాస్తవానికి గనులు లేకపోతే.. విశాఖ ఉక్కు ముందుకు నడిచే పరిస్థితిలేదు. దీనిపైనే కార్మికులు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. అలాంటిది ఇప్పుడు 34 విభాగాల్లో కీలకమైన మైనింగ్‌లు ఉండడంతోపాటు.. బ్లాస్ట్ ఫర్నేజ్-1, 2, 3లను కూడా ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చేశారు. ఈ పరిణామాలు.. మరింతగా కూటమి సర్కారుకు ఇబ్బందులు తెస్తున్నారు. కార్మిక సంఘాలు సహా.. ఉద్యోగులు కూడా ఈ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. ఇదేం పద్ధతని ప్రశ్నిస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేది లేదని అంటూనే.. ఇలా నోటిఫికేషన్లు ఇవ్వడం ఏంటన్నది వారి నిలదీత.ఇదిలావుంటే.. ప్రస్తుతం ఢిల్లీ వెళ్లిన.. మంత్రి నారా లోకేష్.. ఈ వ్యవహారాన్న ప్రస్తావించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఒకవేళ ప్రైవేటీకరించాలని అనుకుంటే.. నేరుగా చెప్పాలని.. కూడా కార్మిక సంఘాలు పట్టుబడుతున్నాయి. ఇది కూటమి నాయకులకు, స్థానిక ఎంపీ భరత్‌కు కూడా ఇబ్బందిగా మారింది. మరోవైపు.. ఈ కేసు హైకోర్టులో విచారణ పరిధిలో ఉంది. ఈ ఏడాది నవంబరులో దీనిపై మరోసారి విచారణ జరగనుంది. ఈ విషయాన్ని కూడా కార్మికులు ప్రస్తావిస్తున్నారు. హైకోర్టులో ఉండగానే ఇలా ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకోవడం ఏంటన్నది వారు చెబుతున్న మాట. ఏదేమైనా.. ఇది ముందు ముంద ఇబ్బందిగానే మారనుందన్న సంకేతాలు వస్తున్నాయి.

# ఇంటెల్-మైక్రోసాఫ్ట్ లీక్ : కార్పొరేట్ గోప్యత ఒక సవాల్




**హైదరాబాద్  పెన్ పవర్:** అమెరికా టెక్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన ఇంటెల్-మైక్రోసాఫ్ట్ లీక్ కేసులో భారతీయ మూలాలున్న ఇంజనీర్ వరుణ్ గుప్తా జీవితం అనూహ్యంగా మారిపోయింది. కంపెనీ గోప్యాంశాలను దొంగిలించినందుకు న్యాయస్థానం అతనికి జైలు శిక్ష నుంచి మినహాయింపునిచ్చి భారీ జరిమానా విధించింది. ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన పొరపాటు మాత్రమే కాదు, కార్పొరేట్ ప్రపంచానికి ఒక పెద్ద హెచ్చరిక.

**ఏంటి ఆ కేసు?**

వరుణ్ గుప్తా దాదాపు పదేళ్ల పాటు ఇంటెల్‌లో ప్రొడక్ట్ మార్కెటింగ్ ఇంజనీర్గా పనిచేశాడు. 2020లో మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు, ఇంటెల్‌కి చెందిన అనేక కీలకమైన రహస్య డాక్యుమెంట్లు, ధరల వ్యూహాలు, క్లయింట్ ప్రాజెక్టులు, వ్యాపార ప్రణాళికలను కాపీ చేశాడు. ఇవి ప్రత్యర్థి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే అంతటి సున్నితమైన సమాచారం. ఈ చర్యను గుర్తించిన ఇంటెల్, వెంటనే కోర్టులో కేసు వేసింది.

**కోర్టు తీర్పు**

అమెరికా అటార్నీ వాదన ప్రకారం, గుప్తా ఉద్దేశపూర్వకంగా ఈ గోప్యాంశాలను దొంగిలించినందుకు కనీసం ఎనిమిది నెలల జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. అయితే, గుప్తా తరపు న్యాయవాదులు దానిని "తప్పిద నిర్ణయం"గా వాదించారు. ఈ వాదోపవాదాలు విన్న కోర్టు చివరకు గుప్తాకు జైలు శిక్ష విధించకుండా, సుమారు $34,472 (30 లక్షలు) జరిమానా , రెండేళ్ల పాటు ప్రొబేషన్ శిక్షను విధించింది.

**టెక్ నుండి వైన్‌కు మార్పు**

ఈ కేసు తర్వాత వరుణ్ గుప్తా తన కెరీర్‌ను పూర్తిగా మార్చుకున్నాడు. సెమీకండక్టర్ ప్రపంచాన్ని వదిలి, ఫ్రాన్స్‌కు వెళ్లి వైన్ తయారీ (వైనార్డ్స్) నిర్వహణపై విద్యను అభ్యసించడం ప్రారంభించాడు. ఇప్పుడు అతని లక్ష్యం వైన్ పరిశ్రమలో ఒక టెక్నికల్ డైరెక్టర్‌గా స్థిరపడటం.

ఈ సంఘటన ఒక వ్యక్తి జీవితంలో జరిగిన పెద్ద పాఠం. కార్పొరేట్ గోప్యతను ఉల్లంఘిస్తే ఎలాంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయో ఈ కేసు స్పష్టం చేసింది. అయితే, ఒక తప్పు తర్వాత జీవితాన్ని కొత్తగా ప్రారంభించవచ్చని, కొత్త దిశగా మలుచుకోవచ్చని వరుణ్ గుప్తా నిరూపించాడు. ఇది కార్పొరేట్ ప్రపంచంలోని ఉద్యోగులకు ఒక గట్టి హెచ్చరిక. అదే సమయంలో, జీవితంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి, కొత్త దారిని ఎలా ఎంచుకోవాలో చెప్పే స్ఫూర్తిదాయకమైన కథ కూడా

# టీడీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాల్సిందేనా ?

**హైదరాబాద్  పెన్ పవర్:** టీడీపీ అంటేనే క్రమశిక్షణకు మారు పేరుగా ఉన్న పార్టీ. ఆ పార్టీకి ఒక విధానం ఉంటుంది. కట్టు తప్పిన వారి విషయంలో ఉపేక్షించిన దాఖలాలు అయితే లేవు. గతంలో అయితే ఎవరైనా గీత దాటితే ఎన్టీఆర్ వెంటనే వేటు వేసేవారు చంద్రబాబు జమానాలో అయితే అది కాస్తా మారింది. క్రమశిక్షణా సంఘం ముందు వారిని హాజరు పరచడం, వారి విషయంలో వివరణ తీసుకోవడం వంటివి చేస్తూ తుది హెచ్చరికలు జారీ చేసేవారు. ఇక బాబు హయాంలో టీడీపీ నుంచి సస్పెషన్లు బహు తక్కువ. అలా పరిస్థితి ముదరకుండా ముందే జాగ్రత్త పడేవారు.

**గతం అలా ఇపుడిలా :**

ఇక చంద్రబాబు మాట అంటే టీడీపీలో శిలా శాసనం గా ఉండేది. ఆయన వద్ద ఎవరైనా భయపడాల్సిందే. బాబు ఒకటి రెండు సార్లు చెబుతారు. ముందే సీరియస్ అవరు, కానీ ఆ ఇచ్చిన సమయాన్ని అవకాశాన్ని వాడుకోకపోతే మాత్రం ఎంతటి వారికైనా శిక్ష తప్పదని హెచ్చరికగా ఉండేది. కానీ ఇదంతా గతంగా మారుతోంది. టీడీపీలో బాబు మాటను జవ దాటుతున్న వారు పెరుగుతున్నారు. కట్టు తప్పుతున్నారు. చాలా మంది ఎంతలా చెప్పినా తమకు తోచిన విధంగా చేసుకుని పోతున్నారు. చివరికి ఇవే తలనొప్పులుగా మారుతున్నాయి.

**మంచి పనులు మరుగున :**

ఒక వైపు ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అలాగే అభివృద్ధి అజెండాను ముందు పెట్టుకుని అడుగులు వేస్తోంది. అయితే ఇవి జనంలో చర్చకు పెట్టడం కనా కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహారమే హైలెట్ అవుతోంది వారు చేస్తున్న పనులే జనంలోకి చర్చకు వస్తున్నాయి. ఆ తరహా ఎమ్మెల్యేలు అధికారం ఉంది కదా అని దూకుడుగా ఉంటున్నారు. దాంతో చెడ్డ పేరు పార్టీకి ప్రభుత్వానికి కూడా వస్తోంది అంటున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అని ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేసుకున్నా దానిని మించి ఎమంలెయేలు కొందరు చేస్తున్న వ్యవహారాలే చర్చకు వస్తున్నాయంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఆయా ఎమ్మెల్యేలు చేసే పనులే వైరల్ అవుతున్నాయి అని అంటున్నారు.



**వారి విషయం సీరియస్ గానే :**

ఇక టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మూడు ప్రాంతాలకు చెందిన వారి మీద వచ్చిన ఆరోపణలు కానీ విమర్శలు కానీ ఈ సండెని రాజకీయంగా మండించేశాయి. ఎక్కడ చూసినా వీటి మీదనే చర్చ సాగుతూ వస్తోంది. అనంతపురం ఎమ్మెల్యే కానీ అలాగ గుంటూరులో ఉన్న మరో ఎమ్మెల్యే కానీ ఇక ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇంకో ఎమ్మెల్యే కానీ వీరి విషయంలో అధినాయకత్వం సీరియస్ గా ఉంది అని అంటున్నారు. వీరి మీద వచ్చిన ఆరోపణల పైన హై కమాండ్ గట్టిగానే రియాక్ట్ అవుతోంది. దీంతో వీరి విషయంలో నివేదికలను పార్టీ పెద్దలు కోరుతున్నారని అంటున్నారు.

**యాక్షన్ తప్పదా :**

వివాదాలు లేదా అవినీతి ఆరోపణలు లేదా దాష్టికాలు ఇలా కొందరు ఎమ్మెల్యేలు వార్తలలో ఉంటూ వస్తున్నారు. వారి వల్లనే చెడ్డ పేరు వస్తోంది అని హైకమాండ్ కూడా అర్థం చేసుకుంది అందుకే ఈసారి సీరియస్ గానే యాక్షన్ ఉంటుందా అన్నది చర్చగా ఉన్నది. కొంతమంది మీద అయినా యాక్షన్ తీసుకుంటే

మిగిలిన వారు దారిలోకి వస్తారు అన్న మాట కూడా ఉంది. టీడీపీకి ఎమ్మెల్యేలు ఏకంగా 135 మంది దాకా ఉన్నారు. ఒకరిద్దరు విషయంలో సీరియస్ గా చర్యలు తీసుకున్నా పోయేది ఏమీ లేదు అన్న మాట కూడా ఉంది.

అందుకే ఒకరిద్దరి విషయంలో సస్పెన్షన్ వేటుకు అయినా సిద్ధపడితే మొత్తం పార్టీ దారికి వస్తుంది అని అంటున్నారు. లేకపోతే మొత్తంగా నష్టపోయే ప్రమాదం ఉంది అని అంటున్నారు. ఇక క్రమశిక్షణ కలిగిన పార్టీ అని టీడీపీ రుజువు చేసుకోవాలీ అంటే గట్టి చర్యలు తీసుకోకతప్పదని సూచనలు అయితే వస్తున్నారు. మరి ఒకరిద్దరి విషయంలో చర్యలు తప్పవా అంటే ఏమో వేచి చూడాల్సిందే అంటున్నారు.

# జీఎస్టీ 2.0: సామాన్య ప్రజలకు డబుల్ ధమాకా!




**హైదరాబాద్  పెన్ పవర్:** భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోదీ, దేశ ప్రజలకు ఒక గొప్ప శుభవార్తను అందించారు. ఈ దీపావళికి దేశానికి "డబుల్ ధమాకా" అందిస్తామని ప్రకటించారు. అందులో అత్యంత ముఖ్యమైనది, సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, మధ్య తరహా పరిశ్రమలకు భారీగా ఊరటనిచ్చే జీఎస్టీ 2.0 సంస్కరణలు. ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలకనున్నాయి.

**జీఎస్టీ 2.0లో కీలక మార్పులు**

ప్రస్తుతం, జీఎస్టీలో 0%, 5%, 12%, 18%, 28% అనే ఐదు స్లాబ్‌లు ఉన్నాయి. వీటికి అదనంగా కొన్ని విలాసవంతమైన వస్తువులపై కంపెన్సేషన్ సెస్ కూడా ఉంది. అయితే, కొత్త సంస్కరణల్లో ఈ నిర్మాణంలో గణనీయమైన మార్పులు రాబోతున్నాయి. 12% స్లాబ్‌ను పూర్తిగా రద్దు చేసి, అందులోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లలోకి మార్చనున్నారు. ముఖ్యంగా, 12% స్లాబ్‌లోని 99% వస్తువులను 5% స్లాబ్‌లోకి మార్చే అవకాశం ఉంది. అత్యధిక పన్ను రేటు అయిన 28% స్లాబ్‌లోని 90% వస్తువులు 18% స్లాబ్‌లోకి రానున్నాయి. దీని వల్ల అనేక గృహోపకరణాలు, ఇతర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయి. విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ప్రస్తుతం ఉన్న సెస్‌కు బదులుగా 40% ఏకరీతి రేటును విధించాలని ప్రతిపాదించారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (%ఖజ%) సమస్యలు, రిఫండ్ ప్రక్రియలను మరింత సులభతరం చేయనున్నారు, ఇది చిన్న వ్యాపారులకు గొప్ప ఉపశమనం.

**ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?**

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో కొన్ని ముఖ్యమైన వస్తువుల ధరలు తగ్గుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గృహోపకరణాలు అయిన ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మెషీన్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు 28% నుంచి 18% స్లాబ్‌లోకి మారడం వల్ల తగ్గే అవకాశం ఉంది. ఆహార ఉత్పత్తులు అయిన ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి వాటి ధరలు తగ్గుతాయి. ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌లు వంటి వైద్య ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్ల ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతాయి. బీమా సేవలు అయిన ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై జీఎస్టీ 18% నుంచి 12% లేదా 5%కి తగ్గవచ్చు, ఇది మధ్యతరగతి వారికి పెద్ద ఊరట. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు అయిన చిన్న ప్యాకెట్లలో లభించే షాంపూలు, సబ్బుల వంటి రోజువారీ అవసరాల ధరలు తగ్గుతాయి.

**ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

ఈ సంస్కరణల వల్ల ఆర్థిక వ్యవస్థపై అనేక సానుకూల ప్రభావాలు ఉండనున్నాయి. సామాన్య ప్రజలకు ఊరట లభిస్తుంది. రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, జీవన నాణ్యత మెరుగుపడుతుంది. ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుంది. ధరలు తగ్గడం వల్ల వినియోగం పెరుగుతుంది, ఇది దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. ఎంఎస్ఎంఈలకు లాభం చేకూరుతుంది. సరళీకృత పన్ను నిర్మాణం, తగ్గిన రేట్లతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపార వ్యయాలు తగ్గుతాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. పన్ను నిర్మాణం సులభం కావడం వల్ల పన్ను వివాదాలు తగ్గి, వ్యాపార వాతావరణం మెరుగుపడుతుంది. దీంతో వ్యాపారులు మరింత సులభంగా తమ కార్యకలాపాలను నిర్వహించగలుగుతారు.

పన్ను రేట్ల తగ్గింపు వల్ల స్వల్ప కాలంలో ప్రభుత్వ ఆదాయంపై కొంత ప్రభావం ఉన్నప్పటికీ, వినియోగం పెరగడం వల్ల దీర్ఘకాలంలో ఈ లోటు భర్తీ అవుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ సంస్కరణలు నిజంగానే దీపావళికి సామాన్య ప్రజలకు ఒక గొప్ప బహుమతిగా మారబోతున్నాయి.

# మాజీ మంత్రి సబితకు నోటీసులు: హైకోర్టు కీలక ఆదేశం



**హైదరాబాద్  పెన్ పవర్:** తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఓబులాపురం మైనింగ్ అక్రమాల కేసులో తెలంగాణకు చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈమెతో పాటు.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ చేసింది. గతంలో నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

**ఏం జరిగింది?**

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ గనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై సీబీఐ సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఈ మైనింగ్ అనుమతులు ఇవ్వడంలో అప్పటి మంత్రిగా సబిత, ఐఏఎస్ అధికారులు కృపానందం, శ్రీలక్ష్మి సహా పలువురి పాత్ర ఉందని పేర్కొంది. ఈ క్రమంలో వారిపై ఛార్జిషీట్లు కూడా దాఖలయ్యాయి. అయితే.. తమకు ఈ కేసుతో సంబంధం లేదని.. విధానపరమైన నిర్ణయానికి మాత్రమే తాము కట్టుబడి ఉన్నామని వారు వాదనలు వినిపించారు.

ఈ క్రమంలోనే నాంపల్లిలోని సీబీఐ కోర్టులో పిటిషన్లు వేసి.. ఉపశమనం పొందారు. శ్రీలక్ష్మి విషయంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమెపై తిరిగి కేసును కొనసాగిస్తున్నారు. తాజాగా సబిత, కృపానందంలను కూడా నాంపల్లి కోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ.. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ పిటిషన్ కు కౌంటర్ దాఖలు చేయాలని.. కృపానందం సహా.. సబితను ఆదేశించింది. అనంతరం విచారణను సెప్టెంబరు కు వాయిదా వేసింది.

## సంజు పనికి రాడు.. 14 ఏళ్ళ కుర్రాడిని ఆసియా కప్‌లో ఓపెనింగ్‌కు పంపండి: కృష్ణమాచారి శ్రీకాంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** అబుదాబి, దుబాయ్ వేదికలుగా జరగనున్న ఆసియా కప్ 2025లో టీమిండియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. భారత జట్టుకు పోటీనిచ్చే జట్లు కనిపించడం లేదు. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ సెప్టెంబర్ 28న జరగబోయే ఫైనల్ తో ముగుస్తుంది. ఈ కాంటినెంటల్ టోర్నీకి మంగళవారం (ఆగస్టు 18) భారత జట్టును ప్రకటించనున్నారు. ఆసియా కప్ లో ఓపెనర్లుగా అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ దిగడం దాదాపుగా కన్ఫర్మ్ అయింది. వీరి చోటుపై ఎవరికీ సందేహాలు లేవు.

గత ఏడాది కాలంగా టీ20 ఫార్మాట్ లో అద్భుతంగా రాణించడమే ఇందుకు కారణం. అయితే భారత మాజీ ప్లేయర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఓపెనింగ్ లో కొత్త కాంబోని సూచించాడు. యుఎఇలో జరగనున్న ఆసియా కప్ లో టీమిండియా ఓపెనింగ్ గురించి తన అభిప్రాయాన్ని తెలిపాడు. సంజు సామ్సన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించకూడదని శ్రీకాంత్ సూచించాడు. శాంసన్ కు బదులుగా సాయి సుదర్శన్, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్‌లలో ఒకరిని అభిషేక్ శర్మతో ఓపెనింగ్ చేయాలని చెప్పాడు. ఇందుకు గల కారణం కూడా శ్రీకాంత్ వివరించాడు.

“ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ లో షార్ట్ బాల్‌ను ఎదుర్కోవడానికి సంజు సామ్సన్ ఇబ్బందిపడ్డాడు. నా అభిప్రాయం ప్రకారం, శాంసన్ ఓపెనింగ్ చేయడం సందేహమే. నేను సెలెక్టర్ అయితే, అభిషేక్ శర్మ నా మొదటి ఎంపిక. అతనితో పాటు నేను వైభవ్ సూర్యవంశీ లేదా సాయి సుదర్శన్‌ను ఎంచుకుంటాను. నా 15 మంది సభ్యుల టీ20 ప్రపంచ కప్ జట్టులో వైభవ్ సూర్యవంశీ కూడా ఉంటే బాగుండు. అతను అద్భుతంగా ఆడుతున్నాడు. సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ హెూల్డర్. అతను చాలా బాగా రాణిస్తున్నాడు. యశస్వి జైస్వాల్ కూడా మంచి ఎంపిక”. అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ ‘చీకీ చీకా’లో అన్నారు.

ఐపీఎల్ 2025 సీజన్ లో వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ళ వయసులోనే 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ తర్వాత ఇంగ్లాండ్ తో జరిగిన యూత్ వన్డే సిరీస్ లోనూ అదరగొట్టాడు. ఇక సాయి సుదర్శన్ ఈ సీజన్ ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. జైశ్వాల్ ఇప్పటికే భారత క్రికెట్ లో తనదైన ముద్ర వేశాడు. మరోవైపు 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా దుమ్ములేపారు. వీరిద్దరూ 30 ఇన్నింగ్స్‌లలో 157.09 స్ట్రైక్ రేట్‌తో 33.62 సగటుతో 908 పరుగులు చేశాడు. వీటిలో మూడు సెంచరీలు, మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# సఫారీలతో కంగారులు ఢీ.. నేటి నుంచి వన్డే సిరీస్.. స్క్వాడ్, లైవ్ స్ట్రీమింగ్ పూర్తి వివరాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో ఇండియా మ్యాచ్ లు లేకపోయినా క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి రెండు అగ్ర జట్లు సిద్ధంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు వన్డే సిరీస్ తో ఫ్యాన్స్ కు వినోదాన్ని అందించనున్నాయి. ఇటీవలే టీ20 సిరీస్ ముగించుకున్న రెండు జట్లు మంగళవారం (ఆగస్టు 19) నుంచి వన్డే సిరీస్ కు సిద్ధమవుతున్నాయి. బవుమా, రబడా, హెడ్, హాజిల్‌వుడ్ లాంటి స్టార్ ఆటగాళ్లు ఈ సిరీస్ లో ప్రధాన ఆకర్షణగా మారనున్నారు. మూడు వన్డేల సిరీస్ లో భాగంగా తొలి వన్డే ఆగస్టు 19 న ప్రారంభం కానుంది. మ్యాచ్ లన్నీ ఆస్ట్రేలియాలోని డార్విన్, కైర్న్స్, మెకే వేదికలుగా జరుగుతాయి. రెగ్యులర్ కెప్టెన్ టెంబా బవుమా సౌతాఫ్రికా జట్టును నడిపించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ తర్వాత బవుమా తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్నాడు. మరోవైపు కమ్మిన్స్ దూరం కావడంతో ఆస్ట్రేలియా జట్టుకు మిచెల్ మార్ష్ కెప్టెన్సీ చేయనున్నాడు. టీ20 సిరీస్ లో అద్భుతంగా రాణించిన డెవాల్డ్ బ్రెవిస్, ర్యాన్ రికెల్టన్ పై అందరి చూపు నెలకొంది. ఆస్ట్రేలియా కెప్టెన్ కమ్మిన్స్ తో పాటు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ దూరం కానున్నాడు. హెడ్, మార్ష్, గ్రీన్, లాబుస్చాగ్నే, ఇంగ్లిస్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తుంది. స్టీవ్ స్మిత్, మ్యాక్స్ వెల్ ఈ ఏడాది వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఆస్ట్రేలియా ఆడుతున్న తొలి వన్డే సిరీస్ ఇదే.

**లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలంటే..?**

ఇండియాలో స్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్ టీవీల్లో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. ఆన్ లైన్ లో ఈ సిరీస్ ను జియోహాట్‌స్టార్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడొచ్చు.

**సౌతాఫ్రికా వన్డే జట్టు:**

టెంబా బావుమా (కెప్టెన్), కార్బిన్ బాష్, మాథ్యూ బ్రీట్జ్కే, డెవాల్డ్ బ్రీవిస్, నాంద్రే బర్గర్, టోనీ డి జోర్జి, ఐడెన్ మార్క్రమ్, సెనురన్ ముత్తుసామి, కేశవ్ మహారాజ్, వియాన్ ముల్డర్, లుంగి ఎన్గిడి, లువాన్-డ్రే ప్రెటోరియస్, ర్యాన్-డ్రే ప్రెటోరియస్, సెయింట్ రౌస్టన్, ఆర్. ప్రేనెలన్ సుబ్రాయెన్

**ఆస్ట్రేలియా వన్డే జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, అలెక్స్ కారీ , బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుస్చాగ్నే, లాన్స్ మోరిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా

## టీమిండియాలో చోటు ఖాయం.. 92 బంతుల్లోనే సెంచరీ కొట్టిన ముంబై కుర్రాడు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి జాతీయ సెలక్టర్లకు సవాలు విసిరాడు. ఇటీవలే ఇంగ్లాండ్ తో ముగిసిన టెస్ట్ సిరీస్ లో సర్ఫరాజ్ కు చోటు దక్కని సంగతి తెలిసిందే. జట్టులో ఉండడానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సెలక్టర్లు ఈ ముంబై కుర్రాడిని పట్టించుకోలేదు. ఆ తర్వాత తన ఫిట్ నెస్ పై ఫోకస్ చేసి కేవలం రెండు నెలల్లోనే 17 కిలోల శరీర బరువు తగ్గి స్లిమ్ అండ్ ట్రిమ్ లుక్ తో కనిపించి ఆశ్చర్యానికి గురి చేశాడు. ప్రస్తుతం డొమెస్టిక్ క్రికెట్ లో సెంచరీ కొట్టి సత్తా చాటి భారత టెస్ట్ జట్టులో చోటు సంపాదించే పనిలో ఉన్నాడు.


ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా బుచ్చి బాబు టోర్నమెంట్ సోమవారం (ఆగస్టు 18) నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. గోజన్ కాలేజ్ ఎ గ్రౌండ్‌లో ముంబై తరపున ఆడుతున్న సర్ఫరాజ్.. TNCAపై 92 బంతుల్లోనే సెంచరీ చేయడం విశేషం. 98 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న ముంబై జట్టును తన సెంచరీతో ఆదుకున్నాడు. వన్డే రీతిలో చెలరేగుతూ అలవోకగా బౌండరీల వర్షం కురిపించాడు. ఓవరాల్ గా 138 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ గా పెవిలియన్ కు చేరాడు. సర్ఫరాజ్ ఇన్నింగ్స్ లో 10 ఫోర్లతో పాటు 6 సిక్సర్లు ఉన్నాయి. సర్ఫరాజ్ సెంచరీతో ప్రస్తుతం ముంబై తొలి రోజు 5 వికెట్ల నష్టానికి 365 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. సర్ఫరాజ్ తన చివరి టెస్టును గత ఏడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్ XIతో ఆడాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో సర్ఫరాజ్ ఎంపికైనా ఒక్క మ్యాచ్ లో కూడా ఆడే అవకాశం రాలేదు. దీనికి తోడు గాయం కారణంగా 2024-25 రంజీ ట్రోఫీకి దూరమయ్యాడు. 2024 ఫిబ్రవరి 15 రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్ లోనే రెండు ఇన్నింగ్స్ ల్లో హాఫ్ సెంచరీలు చేసి సత్తా చాటాడు. ఓవరాల్ గా ఆరు టెస్టుల్లో ఇండియా తరపున 371 పరుగులు చేశాడు.

# కూలీ వర్సెస్ వార్ 2- తొలి వీకెండ్ లో రజనీ కాంత్ దే పైచేయి!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ‘కూలీ, జూనియర్ ఎన్టీఆర్- హృతిక్ రోషన్ లీడ్ రోల్స్ లో నటించిన ‘వార్ 2’ ఆగస్టు 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్నాయి. రెండు సినిమాలకు మిశ్రమ స్పందన లభించింది. అయినప్పటికీ.. వసూళ్లలో ఫర్వాలేదనిపిస్తున్నాయి. ఇక ఈ సినిమాలు రిలీజై, తొలి వీకెండ్ కూడా కంప్లీట్ చేసుకున్నాయి. ఈ క్రమంలో ఏ సినిమాకు ఎంతెంత వచ్చాయో చూద్దాం!ఇండిపెండెన్స్ డే, లాంగ్ వీకెండ్ ముగిసింది. దీంతో వార్ 2, కూలీ తొలి వారాంతం కలెక్షన్ల లెక్కలు బయటకు వస్తున్నాయి. అయితే ఈ లెక్కల ప్రకారం.. వార్ 2 కంటే కూలీనే ఎక్కువగా వసూల్ చేసింది. బాక్సాఫీస్ రేసులో వార్ 2 పై కూలీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. కూలీ నాలుగు రోజుల్లో దేశీయంగా రూ.194.25 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. నాలుగో రోజు ఒక్క రోజే కూలీకి రూ.35 కోట్లు వచ్చాయి. అటు వార్ 2 ఇప్పటివరకు తొలి వీకెంట్ క్లోజ్ అయ్యేసరికి రూ.173.60 కోట్లు వసూల్ చేసింది. నాలుగో రోజు ఈ సినిమాకు రూ. 31 కోట్లు వసూల్ అయ్యాయి. అంటే ఫస్ట్ వీకెండ్ లో వార్ 2 కంటే కూలీ రూ.20.65 కోట్లు అత్యధికంగా వచ్చాయి.కాగా, తొలి రోజు రజనీకాంత్ కూలీ రూ.65 కోట్లు వసూల్ చేయగా, వార్ 2కు రూ.52.50 కోట్లు వచ్చాయి. అయితే రెండో రోజు కూలీకి వార్ 2 గట్టి పోటీ ఇచ్చింది. కూలీ రెండో రోజు రూ.54.75 కోట్లు కలెక్ట్ చేయగా.. వార్ 2 రూ .57.35 వసూల్ చేసింది. అంటే దాదాపు రూ.3 కోట్లు కూలీ కంటే ఎక్కువగా వార్ 2 వసూల్ సాధించింది.ఇక మూడోరోజు నుంచి కూలీ రేసులో ముందుకు వచ్చింది. మూడో రోజు కూలీ రూ. 39.5 కోట్లు వసూలు చేయగా, వార్ 2 రూ. 33.25 కోట్ల వద్దే ఆగింది. ఇక వీకెండ్ సండే రెండు చిత్రాల వసూళ్లు కాస్త నెమ్మదించాయి. అయినప్పటికీ కూలీ రూ. 35 కోట్లు చేయగా ఎన్టీఆర్ కూలీ రూ. 31 కోట్లు వసూలు చేశాడు.ఇక వరల్డ్ వైడ్ గా కూలీ తమిళ సినిమా రికార్డులను తిరిగి రాస్తూ.. రూ. 320 కోట్లు క్రాస్ చేసింది. అటు వార్ 2 ప్రపంచవ్యాప్తంగా రూ. 215 కోట్లు దాటింది. ఇక ఓవరాల్ గా రజనీ కూలీ ఈ రేసులో ముందుంది. అయితే ఇప్పుడు లాంగ్ వీకెండ్ ముగిసింది. ఇక రెండో వారంలో రెండు సినిమాలకు అసలైన పరీక్ష మొదల కానుంది. చూడాలి ఈ రేసులో రజనీ ముందుంటాడా? లేదా ఎన్టీఆర్ బౌన్స్ బ్యాక్ అవుతాడా? చూడాలి



**డాంగే విడుదల కోసం నికితా కౌంట్‌డౌన్ ఆనందం!**





**ఆశు రెడ్డికి యానిమల్ ఫ్యాషన్ ఫీవర్ కలకలం రేపింది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com